**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 73, పేజీలు - 08

గురువారం, సెప్టెంబర్ 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే కుట్ర!

**- అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు**

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ అసెంబ్లీ వద్ద ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటించారు. సెప్టెంబర్ 6వ తేదీ నుంచి జరిగిన ఘటనలన్నింటినీ విచారించేందుకు హైదరాబాద్ సిటీ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను కేసు పర్యవేక్షణ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఈ ఘటనల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నవారితో పాటు వెనుక ఉండి కుట్రకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు ఎర్రవల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమై సభా కార్యక్రమాలను అడ్డుకునేందుకు ప్రణాళిక రూపొందించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకే అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

2లో..

## మేజిస్ట్రేట్‌కు అంత ధైర్యం ఎక్కడిది.?

**- విద్యార్థికి నోటీసులపై సుప్రీంకోర్టు ఆగ్రహం**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** నిరసనలో పాల్గొన్న ఓ న్యాయ విద్యార్థికి నోటీసులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. విద్యార్థులపై చర్యలు తీసుకోవద్దని సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా, న్యాయ విద్యార్థికి గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసులు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. ఆ నోటీసులను తర్వాత ఉపసంహరించుకున్నప్పటికీ ఈ వ్యవహారం చాలా తీవ్రమైనదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో

2లో..

## కేసీఆర్ చావు కోరుకుంటున్నారు

**- ప్రభుత్వంపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు**

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ - 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత - రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు గవర్నర్‌ను కలిశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, ఇతర అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రతినిధి బృందం బుధవారం

2లో..



## ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని

2లో..

## భూముల భద్రతే లక్ష్యం

**- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ**



- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు

**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రవ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో తనపై అనను అక్రమంగా అరెస్ట్ చేసిందని గుర్తు చేశారు. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.'గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం నన్ను అన్యాయంగా అరెస్టు చేసిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9 తేదీన నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. ఏ తప్పు లేకుండా అరెస్ట్ చేయడం బాధ కలిగించింది'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.

2లో..

## చంద్రబాబు సీఎంగా ఉంటే ఎన్నికలు సాఫీగా జరగవు

**- ఎన్నికలు సజావుగా జరిగితే వైసీపీదే గెలుపు**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు, ఓట్ల గల్లంతు సాకులు చూపుతూ స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని చూస్తోందని వైసీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. కూటమి అధికార దుర్వినియోగాన్ని ఎదుర్కొని పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.'చంద్రబాబు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నాడు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం నేతలతో వైఎస్ జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై మాట్లాడారు. ఎన్నికలు పెట్టేవాడే అయితే, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అంటూ డ్రామాలు ఎందుకు ఆడుతున్నాడు? కోర్టు కొట్టేస్తే ఆ సాకు చూపి ఎన్నికలు వాయిదా వేయాలని కుట్ర చేస్తున్నారు. సర్ తో 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని వారే చెబుతున్నారు, మరి నిజంగా ఎన్నికలు జరుగుతాయా?'అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ సందేహం వ్యక్తం చేశారు.

2లో..



## యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే

- బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరన్న బండి సంజయ్
- అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేవన్న సంజయ్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

2లో..



## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

**- కేటీఆర్, హరీశ్‌రావుతో సహా 22 మందిపై యాక్షన్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ శాసనసభ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సెషన్ ముగిసే వరకు బీఆర్ఎస్‌కు చెందిన సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. బుధవారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే మూడో రోజున బీఆర్ఎస్ సభ్యులు వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలను పదే పదే అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనక్కి తగ్గాలని, ఇది దొరల పాలన కాదని కేటీఆర్ సహా బీఆర్ఎస్ సభ్యులను స్పీకర్ ఘాటుగా హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రతిపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి తీవ్రమవ్వడంతో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ఇచ్చిన సిఫారసు మేరకే స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 17 మంది

2లో..

## భాగ్యనగరానికి ప్రమాద ఘంటికలు

**- విపత్తులను తట్టుకోలేని నగరాల్లో ప్రపంచంలోనే రెండో స్థానం!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరానికి ఓ అంతర్జాతీయ నివేదిక తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. అత్యధిక వేడి, భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే తట్టుకోలేని అత్యంత బలహీనమైన మౌలిక వసతులున్న నగరాల్లో ప్రపంచంలోనే హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. ఈ ప్రమాదకర జాబితాలో మొదటి స్థానంలో కూడా మన దేశంలోని నగరమే ఉండటం గమనార్హం. గుజరాత్‌లోని అతిపెద్ద నగరమైన అహ్మదాబాద్,

2లో..

## విజయ్ కూటమికి అధికారిక పేరు

**- కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్‌యూతో కలిసి సెక్యులర్ ఫ్రంట్**



**చెన్నై (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ( టీవీకే ) కూటమికి అధికారిక పేరు ఖరారయ్యింది. టీవీకే అధ్యక్షుడు, సీఎం విజయ్ బుధవారం చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, వీసీకే, ఎండీఎంకే, ఐయుఎంఎల్ పార్టీల నేతలతో రెండోసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ కూటమికి 'లౌకిక సామాజిక న్యాయ విజయ కూటమి'అని నామకరణం చేశారు. చెన్నైలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్, విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్), మరుమలర్చి ద్రావిడ మున్నేట్ర కజగం (ఎండీఎంకె) పార్టీల అగ్రనేతలు పాల్గొంటారని పీటీఐ వార్తా సంస్థ ముందే ధ్రువీకరించింది.అయితే, సీపీఎం, సీపీఐ పార్టీలు ఈ భేటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. జులై 1 తర్వాత

2లో..

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే కుట్ర!

22ఏ భూముల అంశంతో పాటు పలు సమస్యలను సభలో చర్చించాలని ప్రభుత్వం భావించిందని చెప్పారు. ఈ అంశాలపై చర్చ జరిగితే బీఆర్ఎస్ రాజకీయంగా ఇబ్బందుల్లో పడుతుందనే ఉద్దేశంతోనే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకునేందుకు కుట్ర చేశారని సీఎం రేవంత్ ఆరోపించారు. సెప్టెంబర్ 6వ తేదీన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం ఫాంహౌస్‌లో జరిగిందని అయితే ఈ కుట్రకు ప్రణాళిక అక్కడే జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈనెల 7వ తేదీన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని 8న ఫాంహౌస్ వద్ద శుద్ధి కార్యక్రమం చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రస్తావించారు.స్పీకర్ పదవిని, ఆయన కుటుంబ సభ్యులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా పరిగణిస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించడం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం విద్వేషాలు, అల్లర్లను రెచ్చగొట్టడం వంటి చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేశారు.

అసెంబ్లీ ముందు జరిగిన మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించేందుకు హైదరాబాద్ డీసీపీ, ఐపీఎస్ అధికారి విజయ్‌కుమార్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారితో పాటు వెనుక ఉండి ప్రణాళిక రచించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పాత్రపైనా విచారణ ఉంటుందని చెప్పారు. చట్టపరమైన ప్రక్రియలో భాగంగా నిందితులపై ఆధారాలు, ఘటనలకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టులు బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజాసమాజంలో జరిగే చర్చను ఎవరూ నియంత్రించలేరని వ్యాఖ్యానించారు.అసెంబ్లీ ఘటనలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై జరిగిన వ్యాఖ్యలను రేవంత్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. దళితులను ఉద్దేశపూర్వకంగా అవమానించినట్లు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన సందర్భంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని వెల్లడించారు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పడం వల్ల ఎవరి గౌరవం తగ్గదని, సమాజంలోని అట్టడుగు వర్గాల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎం పేర్కొన్నారు.ఇటీవల ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకున్న ఓ ఘటనను ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి అక్కడ జరిగిన పరిణామాలపై తాము రాష్ట్రపతికి ఫిర్యాదు చేశామని చెప్పారు. అదే తరహాలో తెలంగాణలోనూ అసెంబ్లీ ముందు బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులు, స్పీకర్ విషయంలో అనుచిత ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కుట్ర జరిగిందనే తమ ఆరోపణలకు నిరసనగా కొందరు దళితులు అక్కడికి వెళ్లారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారి ఉద్దేశం దాడులు చేయడం కాదని ప్రజాస్వామ్య పద్ధతిలో డప్పు కొట్టి తమ నిరసనను వ్యక్తం చేయడమేనని పేర్కొన్నారు.అసెంబ్లీలో తన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ చరిత్రను కూడా సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం, విశ్వాసం ఉందని అన్నారు. అణచివేత, వివక్షకు గురైన వర్గాల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పాత్ర ఉందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి వివిధ సంక్షోభాల సమయంలో దేశాన్ని నిలబెట్టడంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# మేజిస్ట్రేట్‌కు అంత ధైర్యం ఎక్కడిది.?

జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు విద్యార్థికి ఈ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విషయం బుధవారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం దృష్టికి వచ్చింది. “మేజిస్ట్రేట్ నోటీసులు ఇచ్చే ధైర్యం ఎలా చేశారు? ఏ విద్యార్థిపైనా బలవంతపు చర్యలు తీసుకోవద్దని మేం స్పష్టంగా చెప్పాం. ఆ ఆదేశాలను ఏ మేజిస్ట్రేట్ ఉల్లంఘించకూడదు” అని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో విద్యార్థి కార్యకర్త ఆకృతి చౌధరిపై ‘జాతీయ భద్రతా చట్టం’ (ఎన్ఎస్ఏ) ప్రయోగించిన విషయంలో అలహాబాద్ హైకోర్టు కూడా యూపీ అధికారులను తీవ్రంగా మందలించింది. అధికారుల చర్యల వల్ల ఉత్తరప్రదేశ్ ‘ఆర్వెలియన్ డిస్టోపియా’గా మారే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అధికారులు తమ విధేయత రాజ్యాంగం పట్ల ఉండాలి తప్ప రాజకీయ నేతల పట్ల కాదని స్పష్టం చేసింది. నోయిడా డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ మేధా రూపమ్ ఆమోదించిన ఆకృతి చౌధరి ఎన్ఎస్ఏ నిర్బంధాన్ని సెప్టెంబర్ 2న హైకోర్టు కొట్టివేసింది. ఆమెకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. నిరసనకు సంబంధించిన కేసుల్లో తగిన ఆధారాలు లేకుండానే కఠినమైన ఎన్ఎస్ఏను ప్రయోగించడంపై గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా యంత్రాంగం, పోలీసులపై ధర్మాసనం మండిపడింది.

# మేజిస్ట్రేట్‌కు అంత ధైర్యం ఎక్కడిది.?

## తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా

‘48 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాను. 31 ఏళ్ల క్రితం తొలిసారి సీఎం అయ్యాను. విలువలతో కూడిన రాజకీయం చేయాలని పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. చాలా మంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. నాపై చేసిన ఆరోపణల్ని రుజువు చేయలేక పోయారు... అదే నా నిబద్ధత’అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. ‘రాజకీయంపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ ప్రారంభించాం. అప్పట్లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున కుటుంబ వ్యాపారాన్ని నా సతీమణికి అప్పగించా. నాకు ధన వ్యామోహం లేదు. కేవలం తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా’అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

## జైలుకెళ్తానని ఎప్పుడు అనుకోలేదు

‘నంద్యాలలో ఓ సమావేశానికి వెళ్లిన నన్ను అరెస్టు చేస్తామని అర్ధరాత్రి వచ్చారు. నాపై ఆరోపణలు ఏమిటో చెప్పాలని అడిగితే... అరెస్టు చేసిన తర్వాత చెబుతామని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రిని ఉన్న పళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. నా జీవితంలో ఎన్నడూ అనుకోని సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగింది’అని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ‘నేను జైల్లో ఉన్న సమయంలో నాకేం జరుగుతుందోనని తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చింది. హైదరాబాద్ లో కొందరు అడ్డుపడినా టెకీలు కూడా ముందుకు వచ్చి నిరసనలు తెలిపారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా కదలి వచ్చారు’అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.

## పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే వెనక్కి పంపించేశారు

‘జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారు. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపారు’అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ‘గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయి. ఈడీ లాంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది. గతంలో అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని బలవంతంగా అరెస్టు చేశారు. వేధింపులకు గురి చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కు పంపేశారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి’అని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు.

## ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు

‘నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ’అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ‘నేను చేసే ఏ పని అయినా అది తెలుగు జాతికి న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం. మాజీ సీఎం వైఎస్ఆర్ కు ఆయన కొడుకు విషయంలో జాగ్రత్తలు తీసుకోమని ఆనాడే చెప్పాను. గొడ్డలి పార్టీ అధ్యక్షుడిని ఆయన తండ్రి వైఎస్ఆర్ చదువుకోడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడు, ఈ విషయం స్వయంగా వైఎస్ఆర్ చెప్పాడు. కొడుకుతో బాధలు భరించలేక అతన్ని వైఎస్ఆర్ బెంగళూరులోనే ఉంచారని తల్లి విజయమ్మ మాజీ సీఎం రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారు. రోశయ్యే స్వయంగా ఈ విషయం చెప్పారు’అని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు.

## బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు

‘ఓ సీఎంగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగుళూరు లాంటి చోట పెట్టాడు అంటే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఎలాంటి వాడో అర్థం చేసుకోండి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును ఎప్పుడూ ఏపీకి రానీయలేదు’అని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. ‘బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు. తెల్లవారితే సీఎంగా ఉన్న నాపై నింద వేసి తన పత్రికలో రాయించారు. తన చెల్లి సునీతను కూడా ఏమార్చారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేదా?’అని సీఎం చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ‘ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారు. అలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి వచ్చింది’ అని సీఎం చంద్రబాబు నాయుడు నిట్టూర్చారు.

# కేసీఆర్ చావు కోరుకుంటున్నారు

రోజున లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ “గవర్నర్ మాకు సమయం ఇచ్చినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేశాము. ఆయన ఈమధ్యనే అనారోగ్యానికి గురైన నేపథ్యంలో, ఆయన ఆరోగ్యం గురించి వాకబు చేశాము. 420 హామీలతో అధికారంలోకి వచ్చి, 1000 రోజుల నుంచి అన్ని రకాల హామీలను విఫలం చేయడంతో పాటు, పరిపాలనలోనూ పూర్తిగా విఫలమైన తీరును గవర్నర్‌కు వివరించాం. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ప్రజలు ఎన్ని బాధలు పడుతున్నారో ఆయనకు తెలియజేశాము. రాష్ట్రంలోని రైతన్నలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించాము. రాష్ట్రంలోని నిరుద్యోగ విద్యార్థులు, యువతను రాహుల్ గాంధీ ఏ విధంగా మోసం చేశారో తెలియజేశాము.

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న ఆందోళన, వారి డిమాండ్లను వివరించాము. మొన్న శాసనసభ సమావేశాల మొదటి రోజు మా పైన ప్రభుత్వ ఆధ్వర్యంలో పోలీసులు దాష్టీకానికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో నిరసన తెలిపిన తీరులోనే, టీ-షర్ట ద్వారా నిరసన తెలపాలని మేము అనుకున్నాము. కానీ మా హక్కులను కాలరాస్తూ శాసనసభ్యులమైన మమ్మల్ని సభలోకి రానివ్వకుండా రోడ్డుపైనే అడ్డుకున్నారు. ఈ విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం” అని తెలిపారు.తమపై జరిగిన దాడిని, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులపై జరిగిన దాడిని ఫోటోలు, ఆధారాలతో గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తమపై దాడి చేసి, తిరిగి తమనే బద్నాం చేస్తున్న కాంగ్రెస్ కుట్రను కూడా వివరించామని చెప్పారు. తమ పార్టీ నాయకులతో పాటు అందరిపైనా దాడి చేయడానికి వెళ్లిన పోలీసులపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఈ విషయాన్ని కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. “హైకోర్టు చెప్పినా శాసనమండలి, శాసనసభలోకి మమ్మల్ని రాకుండా ప్రభుత్వం అడ్డుకుంది. ఈ ప్రభుత్వానికి రాజ్యాంగం, కోర్టులపై ఎలాంటి గౌరవం లేదు. అందుకే ఈరోజు మమ్మల్ని సస్పెండ్ చేశారు. మా మీద దాడి చేసి, మా శాసనమండలి సభ్యులు అనని మాటలను అన్నట్టుగా, జరగని అవమానాన్ని జరిగినట్టుగా చూపెడుతూ సభా సమయాన్ని వృథా చేస్తున్నారు. స్పీకర్ అంటే మాకు కూడా గౌరవం ఉంది. దళిత స్పీకర్, దళిత స్పీకర్ అని స్పీకర్‌ను మేము అనని మాటలు కాంగ్రెస్ వాళ్ళు వందల సార్లు అంటున్నారు. స్పీకర్‌ను వాళ్ళు అవమానించారు. నడిరోడ్డు మీద మా ఆడబిడ్డకు జరిగిన అవమానం, తెలంగాణలోని మహిళా లోకం మొత్తానికి జరిగిన అవమానం. అది గౌరవ సభ కాదు, కౌరవ సభ. అది శాసనసభ కాదు, దుశ్శాసన సభ అని గవర్నర్‌కు చెప్పాం. మా నాయకుడు కేసీఆర్ మీద జరిగిన హత్యా ప్రయత్నం, ఇంటి మీద జరిగిన దాడి గురించి గవర్నర్‌కు వివరంగా తెలియజేశాం. దీనిని ముఖ్యమంత్రి వెనకాల నుంచి చేయించారు. చావు డబ్బు ఎప్పుడు కొడతారో అందరికి తెలుసు, అలాంటి మహానాయకుడు కేసీఆర్ ఇంటి వద్ద చావు డబ్బు కొట్టడం అనేది కుసంస్కారం” అని కేటీఆర్ పేర్కొన్నారు.“శాసనసభ వ్యవహారాలకు సంబంధించిన అంశాలతో పాటు, బయట జరిగిన ప్రతి సంఘటనపైన, మేము చెప్పిన ప్రతి అంశంపైన విచారణ జరిపిస్తామని గవర్నర్ హామీ ఇచ్చారు. మాకు గవర్నర్ గారు ఇచ్చిన హామీ మేరకు, ప్రస్తుతం జరుగుతున్న దౌర్జన్యకాండలో ఆయన జోక్యం చేసుకుంటారని భావిస్తున్నాము. ప్రభుత్వం విడుదల చేసినవి ఏఐ ఫోటోలు, వీడియోలు. ఈ అంశంలో ఇప్పటికే ఫిర్యాదు చేశాము. తప్పుడు చిత్రాలు, తప్పుడు ఫిర్యాదులు ఉపయోగించే వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటాము” అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఈ20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. “ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు” అని ఆయన వివరించారు.ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సెషన్ ముగిసేవరకు సస్పెండ్ చేశారని తెలుస్తోంది. సభలో లేని వారిని ఎందుకు సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్నారు.ఈ సస్పెన్షన్‌కు గురైన వారిలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కౌశిక్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మీతో పాటు మాధవరం కృష్ణారావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, జగదీశ్ రెడ్డి, అనిల్ జాదవ్, సుధీర్‌రెడ్డి ఉన్నారు. సభ సజావుగా సాగేందుకు సహకరించకుండా అడ్డంకులు కలిగిస్తున్నందుకే వారిని సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించగా, స్పీకర్ దానికి ఆమోదం తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన, కేసీఆర్ నివాసం వెలుపల పోలీసుల సమక్షంలో జరిగిన ర్యాలీ, కేసీఆర్ చనిపోవాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన బెదిరింపులు, రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని శాసనసభలో డిమాండ్ చేశారు.

# భాగ్యనగరానికి ప్రమాద ఘంటికలు

ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచి తీవ్ర ఆందోళన రేకెత్తించింది. ప్రపంచవ్యాప్తంగా నగరాలు ఎదుర్కొంటున్న ముప్పులు, వాటి సన్నద్ధతపై ‘ఆల్ఫాజియో’ అనే సంస్థ నిర్వహించిన విస్తృత అధ్యయనంలో ఈ చేదు నిజాలు వెలుగులోకి వచ్చాయి. చారిత్రక వైభవంతో దేశంలోనే తొలి యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తింపు పొందిన అహ్మదాబాద్‌కు భారీ వరదల ముప్పు పొంచి ఉందని, వాటిని ఎదుర్కొనే వ్యవస్థలు నగరంలో దాదాపుగా లేవని ఈ నివేదిక హెచ్చరించింది. ఇక హైదరాబాద్ విషయానికొస్తే, నగరంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కుండపోత వర్షాలను తట్టుకునే శక్తి మౌలిక వసతులకు లేదని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం, ప్రమాదపుటంచున ఉన్న మొదటి పది నగరాల్లో తొమ్మిది ఆసియా ఖండంలోనే ఉన్నాయి. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నగరాలే అధికంగా ఉండటం ఈ ప్రాంతంలోని భౌగోళిక, పర్యావరణ పరిస్థితులకు అద్దం పడుతోంది. అహ్మదాబాద్, హైదరాబాద్ తర్వాత పాకిస్థాన్‌లోని ముల్తాన్, బంగ్లాదేశ్‌లోని ఢాకా, పాకిస్థాన్‌లోని లాహోర్, భారత్‌లోని కోల్‌కతా, పాకిస్థాన్‌లోని ఫైసలాబాద్, కరాచీ, బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ నగరాలు వరుసగా ఉన్నాయి.

## సురక్షిత నగరాలు ఏం చేస్తున్నాయి.?

ఒకవైపు ప్రమాద ఘంటికలు మోగుతుంటే, మరోవైపు కొన్ని నగరాలు ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ అధ్యయనం ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత సురక్షిత నగరంగా అమెరికాలోని షికాగో నిలిచింది. ఆ తర్వాత అడిస్ అబాబా (ఇథియోపియా), మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా), బార్సిలోనా (స్పెయిన్), ప్యారిస్ (ఫ్రాన్స్) వంటి నగరాలు ఉన్నాయి. “సురక్షిత నగరం అంటే అక్కడ విపత్తులే రావని అర్థం కాదు. ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఆ నగరాలు సిద్ధంగా ఉన్నాయని అర్థం చేసుకోవాలి” అని ఆల్ఫాజియో సంస్థ వ్యవస్థాపకుడు పరాగ్ ఖన్నా వివరించారు. ప్రమాదంలో ఉన్న నగరాలు తమ మౌలిక వసతులను బలోపేతం చేసుకోవడం ద్వారా సురక్షితంగా మారవచ్చని ఆయన సూచించారు. ఉదాహరణకు, వేసవి తాపాన్ని తట్టుకునేందుకు పవర్ గ్రిడ్లను పటిష్టం చేయడం, వరద ముప్పును తప్పించుకునేందుకు షికాగో తరహాలో భారీ భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థలను నిర్మించడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

# విజయ్ కూటమికి అధికారిక పేరు

అధికారిక కూటమి చర్చలను లెఫ్ట్ పార్టీలు బహిష్కరించడం ఇది వరుసగా రెండోసారి. ఈ నిర్ణయంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం మంగళవారం స్పందిస్తూ అసెంబ్లీలో స్థిరత్వాన్ని కాపాడటమే లక్ష్యంగా వెలుపలి నుంచి కేవలం అంశాల వారీగా మద్దతు మాత్రమే కొనసాగుతుందని స్పష్టం చేశారు.మరోవైపు జాతీయ నాయకత్వం అంశంపై టీవీకే, కాంగ్రెస్ పార్టీల మధ్య బహిరంగ విభేదాలు మరింత వేడి రాజేస్తున్నాయి. 2029 సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ టీవీకే ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన వ్యాఖ్యలపై తమిళనాడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీఎన్సీసీ) నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే తిరుగులేని నాయకుడని కాంగ్రెస్ మంత్రి ఎస్. రాజేష్ కుమార్ ఉద్ఘాటించారు. ఈ ఒప్పందానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తే మంత్రివర్గంలో భాగస్వామ్యంపై పార్టీ పునరాలోచించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.ఈ వివాదం తీవ్రం కావడంతో టీవీకే నాయకత్వం స్పందించింది. అవి ఎమ్మెల్యేల వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, సాధారణ మెజార్టీకి 10 సీట్ల తక్కువకావడంతో కాంగ్రెస్, ఐయూఎంఎల్, వీసీకే, కమ్యూనిస్టులు మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. తాజాగా, కూటమికి సెక్యులర్ సోషల్ జస్టిస్ ఫ్రంట్ అనే పేరును ఖరారు చేశారు.

# చంద్రబాబు సీఎంగా ఉంటే ఎన్నికలు సాఫీగా జరగవు

## మాట నిలబెట్టుకున్నాం. కార్యకర్తలు గర్వపడేలా మన పాలన



వైసీపీ 5 ఏళ్ల పరిపాలన, రెండున్నర ఏళ్ల చంద్రబాబు పాలన మధ్య తేడాపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది అని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. ‘మన పాలనపై మన ప్రతి కార్యకర్త సగర్వంగా చెప్పుకోగలిగేలా, ఏ ఇంటికైనా ధైర్యంగా వెళ్లగలిగేలా మన పాలన సాగింది. అలా ఏ ఇంటికి అయినా వెళ్లి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త గర్వంగా చెప్పుకునే పరిస్థితి. మ్యానిఫెస్టోకు ఒక అర్థం తీసుకొచ్చి, మొత్తం అమలు చేసిన చరిత్ర మనది. చంద్రబాబునాయుడుగారు ఏకంగా మ్యానిఫెస్టోతో పాటు, ప్రతి ఇంటికి బాండ్లు కూడా పంపారు. ఎన్నికల తర్వాత మ్యానిఫెస్టో జాడ ఉండదు. అదే మన పార్టీ మ్యానిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి 99 శాతం అమలు చేశాం. ప్రతి మాటకు కట్టుబడి ఉన్నాం. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడించారు.

## ఇంటి గడప వద్దే ప్రభుత్వ పాలన

‘ఏటా బడ్జెట్ సమయంలోనే క్యాలెండర్ ప్రకటించి పథకాలు, కార్యక్రమాలు అమలు చేసిన ఘనత మనది. గతంలో ఎప్పుడూ అలా జరగలేదు. వ్యవస్థలో ఎప్పుడూ చూడని మార్పులు తీసుకొచ్చాం. రైతులు, పిల్లలు, మహిళలు, పేదలకు అందించే పథకాలు లంచాలు లేకుండా ఉండే పరిస్థితి ఉంటుందా? అన్న సందేహాలు తీర్చాం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. ‘ప్రతి 50 ఇళ్లకు వాలంటీర్, ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి పాలన ఇంటి గడప వద్దే అందించాం. పూర్తి పారదర్శకంగా పథకాలు అమలు చేశాం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు.

## విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

‘ప్రభుత్వ స్కూళ్లు పూర్తిగా మార్చేశాం. ప్రైవేటకు ధీటుగా అభివృద్ధి చేశాం. మూడో తరగతి నుంచి టోఫెల్ శిక్షణ. నాడు-నేడు పనులు. 6వ తరగతి నుంచి డిజిటల్ బోర్డులు. బైలింగ్వువల్ టెక్స్ట్‌బుక్స్. 8వ తరగతి పిల్లాడి చేతికి ట్యాబ్‌లు ఇచ్చాం. చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కార్యక్రమాలు చేశాం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ గుర్తు చేశారు. ‘ఆరోగ్యశ్రీలో 1000 ప్రొసీజర్ల నుంచి 3300 ప్రొసీజర్లు. రూ.25 లక్షల వరకు పథకంలో వైద్యం అందించాం. ప్రతి గ్రామంలో విలేజ్ క్లినిక్స్. నాడు-నేడు పనులతో ఆస్పత్రుల రూపురేఖలు మార్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీరో వెకెన్సీ. మన దగ్గర స్పెషలిస్టు వైద్యుల కొరత 4 శాతం. అదే జాతీయ స్థాయిలో అది 60 శాతం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ‘ఒకేసారి 18 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టాం. గ్రామస్థాయిలో విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేశాం. కొత్తగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లు. ప్రతి మండలంలో రెండు పీహెచ్‌సీలు. ఆ నలుగురు డాక్టర్లకు ఊళ్లు పంచాం. ఒక్కో డాక్టర్‌కు 4 లేక 5 ఊళ్లు కేటాయించాం. వారు ఆయా గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందించారు. అవన్నీ ఒక్క వైసీపీ ప్రభుత్వంలోనే జరిగాయి’అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు.

## వ్యవసాయ రంగానికి కొండంత అండ

‘నష్టాల్లో ఉన్న రైతులను ఆదుకున్నాం. రైతులను చేయి పట్టించుకుని నడిపించాం. వారి కోసం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశాం. వాటిలో అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్స్‌ను ఉంచాం’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ పేర్కొన్నారు. ‘ప్రతి ఎకరాను ఈ--క్రాప్ చేశాం. పంటల గిట్టుబాటు ధర కల్పించేందుకు ఆర్బీకేల్లో పోస్టర్లు పెట్టాం. ఎక్కడైనా ధరలు రాకపోతే.. సీఎం-యాప్ ద్వారా అగ్రికల్చర్ అసిస్టెంట్ అలర్ట్ చేస్తే, వెంటనే జేసీ జోక్యం చేసుకోవడం, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడడం. ఇవన్నీ దేశంలో కూడా ఎక్కడా జరగలేదు’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడించారు. ‘అంతేకాదు సచివాలయంలో 10 మంది ఉద్యోగులు. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్. చరిత్రలో, వ్యవస్థలో జరగని మార్పులు ఒక్క మన వైసీపీ ప్రభుత్వంలోనే జరిగాయి’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ తెలియజేశారు.

## ప్రజలను దగా చేసిన చంద్రబాబు

‘సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. ప్రతి ఇంటికి తన సంతకం, పవన్ సంతకంతో బాండ్లు పంపారు. మనం ఇచ్చిన పథకాలు మాత్రమే కాకుండా, మన కంటే ఇంకా మూడింతలు ఇస్తామని చెప్పారు. అమ్మ ఒడి కింద ఎంత మంది పిల్లలు ఉంటే, అన్ని రూ.15 వేలు ఇస్తామన్నాడు. నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అన్నాడు. ఆ పిల్లల అమ్మలు కనబడితే ఆడబిడ్డ నిధి కింద నీకు రూ.18 వేలు, నీకు రూ.18 వేలు అన్నాడు. రైతులకు రూ.26 వేలు ఇస్తానన్నాడు. చేయూత కింద జగన్ ఏటా రూ.18,750 మాత్రమే ఇస్తున్నాడు. అదే మేం వస్తే నీకు నెలకు రూ.4 వేల చొప్పున, ఏటా రూ.48 వేలు అన్నాడు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున, ఏటా రూ.36 వేలు ఇస్తామని చెప్పారు.ప్రతి ఇంటికి బాండ్లు పంపి, ప్రజలను దారుణంగా మోసం చేశాడు’అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. అదే ఈరోజు ప్రతి ఇంట్లో ఇదే చర్చ జరుగుతోంది. వైసీపీ మోసం చేయలేదు. చెప్పింది చేశారు. చంద్రబాబును నమ్మి మోసపోయాం. మా నాలుగువేళ్లు నోట్లోకి పోవడం లేదు. నమ్మి మోసపోయామని అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## స్థానిక ఎన్నికల్లోనూ చంద్రబాబు కుట్ర

‘ఇలాంటి పరిస్థితిలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. అవి జరుగుతాయో లేదో తెలియదు. ఎందుకంటే స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అంటూ చంద్రబాబు డ్రామా చేస్తున్నాడు.నిజంగా దాన్ని కోర్టు కొట్టేస్తుందని తెలుసు. అందుకే ఆ సాకు చూపి, ఎన్నికలు వాయిదా వేయాలని కుట్ర చేస్తున్నాడు’అని వైఎస్ జగన్ ఆరోపించారు. ఇక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్). సర్ కార్యక్రమం. వారే చెబుతున్నారు 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని. మరి నిజంగా ఎన్నికలు జరుగుతాయా? అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నిలదీశారు.

## గట్టిగా నిలబడాలి. పోరాడాలి

‘చంద్రబాబు సీఎంగా ఉండగా, ఎన్నికలు సాఫీగా సాగే అవకాశం లేదు. ఎవరు ప్రశ్నించినా అక్రమ కేసులు. అరెస్టులు. జైలుకు పంపడం.రోజుకో డ్రామా. రోజుకో నటన. డైవర్షన్ పాలిటిక్స్. కాబట్టి ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియదు’అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. ‘అయితే ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరిగినా, ప్రజలకు వైసీపీ తోడుగా నిలబడుతుంది. ఎన్నికలు సాఫీగా జరిగితే వైసీపీదే విజయం. ఎన్నికలు సాఫీగా జరగనివ్వకపోయినా, గట్టిగా పోరాడదాం. స్థానిక ఎన్నికల్లో మీరు గట్టిగా నిలబడాలి’అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## జరిగేది కురుక్షేత్ర సంగ్రామం

స్థానిక సంస్థల ఎన్నికలను కురుక్షేత్ర సంగ్రామంతో పోల్చారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. స్థానిక ఎన్నికల్లో వీరు చేసే అధికార దుర్వినియోగం, పోలీసు బలగాల ప్రయోగం, వాటన్నింటిపై కసి వచ్చే సాధారణ ఎన్నికల్లో కనబడాలి అని జగన్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలు. ప్రజలకు తోడుగా కార్యకర్తలు నిలబడతారు. వారికి తోడుగా మన పార్టీ నిలబడాలి. దౌర్జన్యంతో ఎప్పుడూ పాలకులు రాజ్యం చేయలేరు. గుర్తుంచుకోండి అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

# యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. “నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు” అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# జనసైనికుల్లో నెలకొన్న నైరాశ్యం

**కాకినాడ,సెప్టెంబర్ 9 :** జనసేనలో స్తబ్ధత నెలకొంది. ఇటు నేతల్లోనూ అటు కార్యకర్తల్లోనూ ఈ నైరాశ్యం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం పెద్దగా లేదు. అక్టోబరు చివరలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నైరాశ్యం జనసేనను ఎటు వైపు తీసుకెళుతుందన్న చర్చ ఇటు పార్టీలోనూ, అటు కూటమిలోనూ జరుగుతోంది. పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురయి కేరళలో ఆయుర్వేద చికిత్స తీసుకు వచ్చిన తర్వాత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొంటారా? లేదా? అన్న దానిపై స్పష్టత లేదు. పవన్ ప్రచారానికి రాకుంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందన్న భావన జనసైనికుల్లోనూ, కూటమిలోని మిగిలిన పార్టీల్లోనూ వ్యక్తమవుతుంది. ఈ కారణం వల్లనే జనసైనికుల్లోనూ, నేతల్లోనూ కొంత స్తబ్ధత నెలకొందని చెప్పాలి. జనసేన పార్టీలో ఎప్పుడైనా నైరాశ్యం లేదా స్తబ్ధత నెలకొన్నప్పుడు, ఆ నైరాశ్యాన్ని పారదోలి పార్టీని ముందుకు నడిపేది ముమ్మాటికీ ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజం. 2019 ఎన్నికల ఓటమి తర్వాత లేదా కూటమి రాజకీయాల నేపథ్యంలో కార్యకర్తలలో అక్కడక్కడా గందరగోళం, నైరాశ్యం ఏర్పడిన ప్రతిసారీ పవన్ కళ్యాణ్ తన స్ఫూర్తిదాయక ప్రసంగాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ వస్తున్నారు. పార్టీలో నైరాశ్యాన్ని పారదోలేందుకు, క్యాడర్‌ను ఉత్తేజపరిచేందుకు కేవలం పవన్ కళ్యాణ్ మత్రమే కారణమవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయడం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమన్వయ కమిటీలను నియమించి దిశానిర్దేశం చేయడం ద్వారా శ్రేణులకు ఆయన భరోసా ఇస్తున్నారు. 2024 ఎన్నికల్లో సాధించిన 100% విజయంతో ప్రస్తుతం జనసేన ఏపీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు కార్యకర్తల్లో గర్వాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నాదెండ్ల మనోహర్, నాగబాబు మరియు ఇతర ముఖ్య నేతలు పార్టీ అంతర్గత వ్యవహారాలను చక్కదిద్దుతూ, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ నైరాశ్యానికి తావులేకుండా చూస్తున్నారు. జనసేన బలం వారి అంకితభావం గల జనసైనికులు, వీరమహిళలు. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ సోషల్ మీడియా వేదికగా పార్టీ సిద్ధాంతాలను వారు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. పార్టీ ఎదుగుదల క్రమంలో ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఈ నైరాశ్యాన్ని పారదోలాలంటే స్వయంగా పూనుకోవాలి. అలాగే ఆగస్టు 15వ తేదీ నాటికి నియమిస్తామన్న కమిటీల నియామకాన్ని వెంటనే చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలన్నఅభిప్రాయం వ్యక్తమవుతుంది.

## పార్టీల పేర్లతో ఐడీలు తీవ్రమైన ఈగో పోరు

**విజయవాడ,సెప్టెంబర్ :** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన కూటమి ప్రభుత్వ విధానాలు, విజయాలు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడుతున్న ప్రధాన శక్తి ప్రతిపక్షం కంటే కూడా ఇరు పార్టీల సానుభూతిపరులుగా సోషల్ మీడియాలో చెలామణి అవుతున్నవారే. అనడంలో ఎలాంటి సందేహం లేదు. క్షేత్రస్థాయిలో నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తు ధర్మాన్ని పాటించి పాలనపై దృష్టి సారిస్తుంటే, సోషల్ మీడియాలో ఇరు పార్టీల పేర్లతో తిరిగే ఐడీలు తీవ్రమైన ఈగో పోరుతో కూటమి స్ఫూర్తికే ఘోరమైన విఘాతం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా సినీ హీరోల అభిమానుల మధ్య ఉండే పాత కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య పోరును రాజకీయాలకు రుద్ది, పరస్పరం పార్టీ అధినేతలను, వారి కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషించుకునే స్థాయికి దిగజారిపోతున్నారు. సాధారణంగా ఏ రాజకీయ పార్టీకైనా సోషల్ మీడియా విభాగం లేదా సానుభూతిపరులు అనేది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా సంస్కరణలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే డిజిటల్ సైన్యంలా పనిచేయాలి. అయితే ఈ రెండు పార్టీల సోషల్ మీడియా అతివాదులు మాత్రం ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలను పక్కనబెట్టి.. పరస్పరం చురకలు వేసుకోవడానికి, ఎన్టీఆర్ లేదా చిరంజీవి వంటి దిగ్గజాల పేర్లను లాగి బురద చల్లుకోవడానికే సమయాన్ని వెచ్చిస్తున్నారు. అసలైన ప్రాధాన్యతలను విడిచిపెట్టి వ్యక్తిగత ద్వేషాన్ని ప్రచారం చేసే వీరు ఎంతమాత్రం పార్టీ సానుభూతిపరులు అనిపించుకోరు, పైగా ప్రత్యర్థి పార్టీ వైఎస్ఆర్‌సీపీకి అయాచితంగా పొలిటికల్ అడ్వాంటేజ్‌ను ప్లేట్‌లో పెట్టి ఇస్తున్నారు. వైసీపీ అమలు చేస్తున్న ఫేక్ నెరేటివ్‌లు, ప్రభుత్వ విధానాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను సంయుక్తంగా తిప్పికొట్టాల్సిన సమయంలో.. ఈ రెండు వర్గాలు ఒకరి శాఖల్లోని లోపాలను మరొకరు వెతికి నెట్‌లో రచ్చకెక్కడం కూటమి ప్రభుత్వ పరువు తీస్తోంది.

ఇటు టీడీపీ శ్రేణులు, అటు జనసేన సైనికులు పరస్పరం డిపార్ట్‌మెంట్ వ్యాఖ్యలపై కౌంటర్లు ఇచ్చుకోవడం వల్ల ప్రజల్లోకి ప్రభుత్వంలో సమన్వయం లేదు అనే తీవ్ర ప్రతికూల సంకేతాలు వెళ్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ కీలక సమయంలో, ప్రయివేటు అకౌంట్ల నుంచి జరిగే ఈ విపరీతమైన ఈగో వార్ రాజకీయంగా కూటమి పునాదులకే ఎసరు పెట్టే ప్రమాదం ఉంది. దీన్ని ఆసరా చేసుకుని వైసీపీ సోషల్ మీడియా టీడీపీ, జనసేన పేరుతో ఫేక్ అకౌంట్లను రంగంలోకి తెచ్చి మరింతగా వివాదాలను పెంచుతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టాలంటే కేవలం హెచ్చరికలు, హితవులతో సరిపెట్టుకుంటే లాభం లేదు. ఇరు పార్టీల నాయకత్వాలు సీరియస్‌గా స్పందించి, తమ అధికారిక సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాల్సి ఉంది. హద్దులు దాటి పరస్పర అధినేతలను, కుటుంబ సభ్యులను అసభ్యకరంగా దూషిస్తున్న ఐడీలను గుర్తించి, వారు సొంత కేడర్ అయినా సరే సైబర్ పోలీసుల ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదా పార్టీల నుంచి బహిరంగంగా దూరం పెట్టడం చేయాలి. పార్టీ ఆత్మగౌరవం కంటే కూటమి బంధం, ప్రభుత్వ స్థిరత్వమే ముఖ్యమని ఇరు అధినేతలు కేడర్‌కు గట్టిగా స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి వైఎస్ఆర్‌సీపీపై పోరాడటాన్ని మర్చిపోయి, తమలో తామే సోషల్ మీడియాలో కొట్టు చావడం అనేది కూటమి ఐక్యతకు కన్పించని శత్రువులా మారింది.

## కొత్త పొలిటికల్ పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ ,సెప్టెంబర్ 9:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏళ్ల తరబడి కీలక సూత్రధారిగా, వైసీపీకి ఆయువుపట్టులా వ్యవహరించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పార్టీ పెట్టేందుకు రెడీ అయ్యారు. తాను సీఎంని అవుతా అంటే ఇంకా తేడాగా ఉంటుందని .. జెన్ జీని సీఎంను చేస్తానని వింత మాటలు చెబుతూ ప్రెస్మీట్ పెట్టారు. ఆయన తీరు చూసిన వారికి ఎవరికైనా రాజకీయ ఉత్సాహం గానీ, దూకుడు గానీ కనిపించడం లేదని అనిపిస్తుంది తీవ్రమైన అలసట, ముఖంలో నీరసం స్పష్టంగా కనిపిస్తోంది. ఏదో ఒత్తిడితో ఆయన రాజకీయ ప్రకటన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. విజయసాయిరెడ్డికి ఉన్న ఏకైక బలం ఆర్థిక వనరులు. రాజకీయాల్లో డబ్బు ఉంటే సరిపోదు, దానిని నమ్మివచ్చే నాయకులు, కేడర్ ఉండాలి అనేది ప్రాథమిక సూత్రం. విజయసాయిరెడ్డి వద్ద వనరులకు లోటు లేకపోయినా, కేవలం ఆయన పెట్టే ఖర్చులను చూసి , డిజిటల్ మీడియా ఫండింగ్‌ను ఆశించి వచ్చే అనుచరులు మాత్రమే ఆయన చుట్టూ చేరే అవకాశం ఉంది. ప్రజాదరణ, మాస్ ఇమేజ్ ఉన్న రాజకీయ నేతలెవరూ తమ భవిష్యత్తును ఆయన కొత్త పార్టీకి తాకట్టు పెట్టే సాహసం చేయరు. నియోజకవర్గాల్లో పట్టున్న నాయకులు కాకుండా, కేవలం నిధులు గుంజుకునే అవకాశం కోసమే వచ్చే ద్వితీయ శ్రేణి నేతలు, తాత్కాలిక అవకాశవాదులతో పార్టీ నడపడం ద్వారా ఆయనకు రాజకీయంగా ఒరిగేదేమీ ఉండదు. చివరికి మిగిలేది కేవలం ఖర్చు మాత్రమే. ఈ కొత్త ప్రయోగం వెనుక ఆయన అసలు కారణం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. వైసీపీని వీడిన నాటి నుంచి జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ, జగన్ పక్కన తనకు దక్కాల్సిన ప్రాధాన్యత , స్థానం మళ్లీ లభిస్తుందనే ఆశ ఆయనలో లోలోపల ఉందనే సంకేతాలు పదే పదే కనిపిస్తున్నాయి. నేరుగా వైఎస్సార్‌సీపీలోకి వెళ్లలేని పరిస్థితి ఉండటంతో, బయట ఒక మూడో ప్రత్యామ్నాయంగా లేదా ఒక రాజకీయ శక్తిగా తన ఉనికిని చాటుకోవడం ద్వారా.. జగన్ తన ప్రాధాన్యతను గుర్తించేలా చేయాలనే ఒక బార్గెనింగ్ స్ట్రాటజీ కూడా ఇందులో దాగి ఉండవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, పాత కేసుల నుంచి రక్షణ, రాజకీయ రంగంలో కొనసాగుతున్నామనే ఒక కవచాన్ని కాపాడుకోవడం లేదా ఇతర కేంద్ర పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గడమూ ఈ కొత్త పార్టీ వెనుక కారణాలు కావచ్చు. అయితే, సొంతంగా ప్రజాకర్షణ లేని వ్యూహకర్తలు పార్టీలు పెట్టి జనం ముందుకు వెళ్లినప్పుడు ఎదురయ్యే ఆర్థిక, రాజకీయ పరాభవాలు చరిత్రలో చాలానే ఉన్నాయి.

# న్యాయపోరాటంలో డీఎస్సీ అభ్యర్థులు

**విజయవాడ** మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని, పారదర్శకంగా జరిగిన నియామకాల ప్రక్రియను దెబ్బతీసేలా సాగుతున్న ఫేక్ ప్రచారాలపై ఇక కేవలం ప్రెస్ మీట్ల స్పష్టతలతో సరిపెట్టుకోవడం సాధ్యం కాదు. నిబంధనల ప్రకారం కష్టపడి మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందిన టీచర్లు తమ కష్టాన్ని కించపరిచేలా సోషల్ మీడియా, కొన్ని మీడియా ఛానెళ్లలో జరుగుతున్న తప్పుడు దాడిపై నేరుగా న్యాయపోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చింది. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ తమ ఆత్మగౌరవాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న వారిపై ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా సివిల్, క్రిమినల్ పరువునష్టం కేసులు వేయడం ద్వారానే ఈ వికృత క్రీడకు అడ్డుకట్ట పడుతుంది. ఆరోపణలకు గురవుతున్న బాధిత ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఒక వేదికపైకి వచ్చి, రూ. కోట్ల పరిపరిహారాన్ని డిమాండ్ చేస్తూ క్రిమినల్ దావాలు దాఖలు చేయాలి. ఫేక్ స్కామ్ అంటూ కోర్టు పరిధిలో తేలని విషయాలను జడ్జిమెంట్లుగా ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు, యూట్యూబర్లు, రాజకీయ నాయకులకు లీగల్ నోటీసులు పంపాలి. స్వయంగా కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని సవాలు చేస్తూ విచారణ పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తున్న ప్రతి ఒక్కరినీ కోర్టు బోనులో నిలబెట్టినప్పుడే, బాధ్యతారాహిత్యంగా మాట్లాడే వారికి చట్టం పవర్ ఏంటో అర్థమవుతుంది. మరోవైపు ఏపీ ప్రభుత్వం కూడా ఇక ఎంతమాత్రం ఉపేక్షించే ధోరణిలో ఉండకూడదు. అధికారులు ప్రతిసారీ స్క్రీన్లపై ఆధారాలు చూపుతూ కేస్–టు–కేస్ ఓపికగా సమాధానాలు ఇచ్చినంత కాలం ఇచ్చారు. కానీ, ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యవస్థల పరువు తీయడమే లక్ష్యంగా కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ప్రభుత్వమే స్వయంగా కేసులు నమోదు చేయాలి. ఫేక్ న్యూస్, డీఎస్సీ నియామకాల ప్రాసెస్‌పై ఎప్పటికప్పుడు వస్తున్న ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారాలు కేవలం ఒక వ్యవస్థను మాత్రమే కాకుండా, రాత్రింబవళ్లు కష్టపడి ఉద్యోగాలు సాధించిన వేలాదిమంది ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చే వివరణలు లేదా పత్రికా ప్రకటనలు కేవలం తాత్కాలిక సడలింపునిస్తాయే తప్ప, ఇలాంటి దుష్ప్రచారాలకు శాశ్వత ముగింపు పలకలేవు. చట్టం ఇచ్చిన రక్షణలను సద్వినియోగం చేసుకుంటూ, ఆధారాలు లేని తప్పుడు ప్రచారాలపై కఠినమైన చట్టపరమైన చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. భారతీయ శిక్షాస్మృతి పరిధిలోని క్రిమినల్ నిబంధనల ప్రకారం కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. అంతేకాకుండా, సివిల్ కోర్టులలో కోట్ల రూపాయల పరువు నష్టం దావాలు వేయడం ద్వారా తప్పుడు ప్రచారం చేసేవారికి ఆర్థికపరమైన భయాన్ని కలిగించవచ్చు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాలు జరుగుతున్నందున, సమాచార సాంకేతిక పరిజ్ఞాన చట్టం కింద కూడా ఫిర్యాదులు చేసి, ఆయా ఖాతాలను బ్లాక్ చేయించడంతో పాటు బాధ్యులపై సైబర్ కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వం , విద్యాశాఖ కేవలం ప్రేక్షక పాత్ర వహించకుండా, డిఫెన్సివ్‌గా సమాధానాలు ఇవ్వడంతో సరిపెట్టకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించే అధికారిక పరీక్షల పై అసత్యాలు వ్యాప్తి చేయడం ప్రభుత్వ ప్రతిష్టను కూడా దెబ్బతీస్తుంది. కాబట్టి, సదరు ఉద్దేశపూర్వక దాడి వెనుక ఉన్న మూలాలను గుర్తించి, పోలీసు శాఖ ద్వారా సుమోటోగా కేసులు నమోదు చేయడం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా డైరెక్ట్ క్రిమినల్ కంప్లైంట్ నమోదు చేయించడం ప్రభుత్వం వైపు నుంచి జరగాల్సి ఉంది. వివరణల కాలం ముగిసింది.. చట్టపరమైన చర్యల కాలం మొదలైంది అనే సంకేతం సమాజంలోకి వెళ్లాలి.

**చక్రపాణి రెడ్డి బూమ్ రాంగ్ అవుతుందా** డీఎస్సీలో ఉద్యోగం సంపాదించి కుప్పంలో ఓ స్కూల్లో పని చేస్తున్నారు చక్రపాణి రెడ్డి. ఆయన మాజీ సైనికుడు, సెయిలింగ్ క్రీడాకారుడు కూడా. దేశ సేవ నుంచి రిటైరైన తర్వాత బీఈడీ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయనతో రిపోర్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయ దినోత్సవం రోజే స్కూల్ కు వెళ్లి పిల్లల ముందే చొక్కా పట్టుకుని సర్టిఫికెట్లు చూపించాలని దౌర్జన్యం చేశాడు. ఇవన్నీ ఫోన్ లో రికార్డు అయ్యాయి. దాంతో పోలీసు కేసు నమోదు అయింది. ఇంత వరకూ బాగానే ఉన్నా.. చక్రపాణి రెడ్డిపై సాక్షి పేరుతో దౌర్జన్యం చేయడం మాత్రం ఓ వర్గంలో కలకలం రేపుతోంది. స్పోర్ట్స్ కోటా పేరుతో బీసీలపై దాడి చేస్తూ వచ్చారు ఇప్పటి వరకూ. అయితే రెడ్డి వర్గాన్ని కూడా వదలడం లేదని కుప్పం టీచర్ ఉదంతంతో క్లారిటీ వచ్చింది. ఓసీల్లో ఉండి ఉద్యోగం తెచ్చుకోవడం ఎంత ఆ వర్గంలో ఉండే వారికి తెలుసు. మాజీ సైనికుడు అయిన చక్రపాణి రెడ్డికి ఉద్యోగం వస్తే ఆయనను అవమానించడమే కాదు.. సాక్షిలోనూ తప్పుడు ప్రచారం చేశారు. ఈ అంశం రెడ్డి వర్గంలోనూ చర్చకు వస్తోంది. మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల వెలిగొండ వేదికపై జగన్ ను మూర్ఖుడని తిట్టారు. ఇలాంటివి చేయాలని జగన్ రెడ్డి చెప్పరు కానీ ఆయన నైజానికి తగ్గట్లే జరుగుతాయి. ఆయన కు అవి ఇష్టం కాబట్టి సజ్జల చేయిస్తారు. దాని వల్ల ఎంత నష్టం జరుగుతుందో చెప్పడం కష్టం. మాగుంట మాట్లాడిన మాటల కన్నా.. కుప్పం టీచర్ చక్రపాణి రెడ్డి ఆవేదన .. వైసీపీకి ఊహించని నష్టం చేయబోతోంది.

## నాలుగు నెలల్లోనే రాబడి లోటు

# ఏకంగా 36,942 కోట్లు

**విజయవాడ** కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక స్థితి క్లిష్టంగాఉంది. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనే రాబడి లోటు ఏకంగా 36,942 కోట్లకు చేరుకుంది. ఇది యేడాది మొత్తానికి బడ్జెట్‌లో అంచనా వేసిన 22,003 కోట్ల కంటే ఎక్కువ. అదే సమయంలో ద్రవ్య లోటు 49,134 కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనాలో 64 శాతం. నికర రుణాలు కూడా సరిగ్గా అంతే మొత్తంలో ఉండటం రాష్ట్ర రుణ భారాన్ని స్పష్టం చేస్తోంది. ఈ గణాంకాలను ఆర్థిక వ్యవస్థ కోణంలో చూస్తే రాబడి లోటు 168% పెరగడం అంటే రాష్ట్రానికి వచ్చే రోజూవారీ ఆదాయం కన్నా నిత్యం చేసే ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అర్థం. పన్నులు, పన్నేతర మార్గాల ద్వారా వచ్చే స్వీయ ఆదాయం సరిపోకపోవడంతో ప్రభుత్వ నిర్వహణకే పెద్ద ఎత్తున నిధులు కొరవడుతున్నాయి. ఇతర ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే, ఆంధ్రప్రదేశ్ అత్యధిక రుణాలు , అత్యధిక రాబడి లోటుతో మొదటి వరుసలో నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ఇంత క్లిష్టంగా మారడానికి ప్రధాన కారణం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు , సంక్షేమ పథకాల ఉచితాల వ్యయం విపరీతంగా పెరిగిపోవడమే. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఈ రోజువారీ నిబద్ధతలకే సరిపోతోంది. మరోవైపు, ఆదాయ మార్గాలను పెంచుకోవడంలోనూ, సంపద సృష్టించే మూలధన వ్యయం సాధించడంలోనూ ఆశించినంత వేగం కనిపించడం లేదు. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ రాబడులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే ఈ పరిణామానికి దారితీసింది. ఈ తరహా లోటు నిరంతరం పెరిగిపోతే రాష్ట్ర భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. సంక్షేమ పథకాలు లేదా రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం తెచ్చిన అప్పుల వల్ల మూలధన సృష్టి నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడుతుంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి రావడం వల్ల రాష్ట్రం రుణ సంక్షోభం దిశగా వెళ్లే ప్రమాదం ఉంది. పైగా, క్రెడిట్ రేటింగ్‌లు తగ్గిపోయి భవిష్యత్తులో కొత్త అప్పులు పుట్టడం కూడా కష్టమవుతుంది. ఈ సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కేవలం అప్పులపై ఆధారపడటం తగ్గించి, కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా పన్ను ఆదాయాన్ని పెంచుకునే ప్రణాళికలు రూపకల్పన చేయాలి. ఉత్పాదకేతర ఖర్చులను అదుపు చేస్తూ, సంపదను సృష్టించే మూలధన రంగానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ ఫలితాలు వచ్చే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

# రెబల్స్ డేంజర్ బెల్స్

**తిరుపతి** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. ఈ ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత కీలకంగా చూస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత గ్రామీణ, పట్టణ స్థాయిలో తమ పార్టీకి ఎంతమేర బలం ఉందో నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోలిస్తే కేడర్‌లో ఉత్సాహం పెరిగిందని, ప్రజల్లో కూడా తమకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైసీపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో ఇప్పటికే ఎన్నికల సన్నద్ధతపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్థానిక ఎన్నికల్లో ఎక్కడా పోటీ లేకుండా ఏకగ్రీవంగా స్థానాలు వదిలేయకూడదనే సంకేతాలను పార్టీ శ్రేణులకు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో అభ్యర్థులను సిద్ధం చేసి, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని బలంగా చూపించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. మరోవైపు అధికార కూటమిలోని తెలుగుదేశం పార్టీ , జనసేన పార్టీ , భారతీయ జనతా పార్టీ మధ్య స్థానిక సంస్థల సీట్ల పంపకం అంత సులభంగా ఉండకపోవచ్చని వైసీపీ అంచనా వేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక స్థాయిలో కూడా మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకే నిర్ణయంతో పనిచేస్తారా అనే సందేహాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక రాజకీయాల్లో వ్యక్తిగత బలం, వర్గ సమీకరణాలు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. దీంతో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రంగా లేదా రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగే అవకాశముందని వైసీపీ లెక్కలు వేస్తోంది. అయితే ఈ అంచనాలన్నింటికంటే ముఖ్యంగా జగన్ ప్రచారం కీలకమవుతుందని పార్టీ నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు, మేయర్ స్థానాలు, జెడ్పీ పీఠాలు వంటి పదవులు స్థానిక రాజకీయాల్లో గణనీయమైన ప్రభావం చూపుతాయి. జిల్లా కేంద్రాలు, ప్రధాన నగరాల్లో వచ్చే ఫలితాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే జగన్ కనీసం కీలక జిల్లాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే పార్టీకి ఊపు వస్తుందని నాయకులు అభిప్రాయపడుతున్నట్లు సమాచారం2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో జగన్ ప్రచారానికి దూరంగా ఉన్నారు. అయితే అప్పటికి వైసీపీ అధికారంలో ఉండటం, ప్రభుత్వ యంత్రాంగం మరియు రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటం వంటి అంశాలు పార్టీకి కలిసివచ్చాయి. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండటంతో నాయకత్వం మరింత చురుగ్గా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంపై జగన్ చేసే విమర్శలు, స్థానిక సమస్యలపై ఆయన ప్రసంగాలు ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే పార్టీకి అదనపు ప్రయోజనం కలుగుతుందని వైసీపీ నేతలు ఆశిస్తున్నారు. అయితే ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తారా, లేక ఎంపిక చేసిన ప్రాంతాలకే పరిమితమవుతారా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. స్థానిక ఎన్నికల షెడ్యూల్, రాజకీయ పరిస్థితులను బట్టి జగన్ ప్రచారంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

## మద్దులపల్లిలో బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి 100 మందికి పైగా చేరిక
- ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతాం
- నిరుద్యోగులకు ఉపాధి మరిచి తమ్ముడికి ఉపాధి చూపించిండు
- కేసీఆర్ వస్తనే సబ్బండ వర్గాలకు మేలని ఆకాంక్షిస్తున్నరు
- కాళేశ్వరం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**మహాదేవపూర్** మద్దులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొట్టె రవీందర్ మరియు వార్డు మెంబర్ చకినరపు సంతోష్ మరియు రాజక్క, సమ్మక్క తదితర మహిళలు, లాస్మయ్య, కళ్యాణ్, రమేష్, శ్రీధర్, సంతోష్, దేవేందర్, రాజయ్య, ఎర్రయ్య, తిరుపతి సుమారు 100 మంది మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి కండువాలు కప్పి భీఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు...ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్దులపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ నాయకత్వానికి బలం చేకూర్చేందుకు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలు బీఆర్ఎస్ వైపు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాల్లో ఎంతమందికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయో ప్రజలు ఆలోచించాలని సూచించారు. మంథనికి ఐటీ కంపెనీలు తీసుకురావడంలో, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించేలా కృషి చేస్తానని, అవసరమైతే తన సొంత ఖర్చుతోనూ సహాయం చేస్తానని తెలిపారు. కాళేశ్వరం ఆలయ పునర్నిర్మాణ పనులపైనా ఆయన విమర్శలు చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో ఆలయాన్ని కూల్చివేయాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు తీరుపై ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం హామీ అమలు విషయాన్ని కూడా ప్రజలు గమనించాలని అన్నారు. మద్దులపల్లి గ్రామానికి చెందిన చాకినరపు రవీందర్ కి ఉద్యోగం రాకుండా కేసుల విషయంలో ఇబ్బందులు కల్పించారని పుట్ట మధుకర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై కాళేశ్వరం ఎస్ఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, రాబోయే రోజుల్లో ప్రజలకు అండగా ఉంటూ సేవ చేస్తామని తెలిపారు.....

## బుల్డోజర్లు పెట్టిన

# కదలని హనుమాన్

**భోపాల్ ,సెప్టెంబర్ 9:** మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రాచీన హనుమంతుని ఆలయాన్ని తొలగించారు. అయితే, అందులోని హనుమ విగ్రహాన్ని మాత్రం అక్కడ నుంచి తరలించడం సాధ్యం కాలేదు. నాలుగు రోజుల పాటు అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించి, భారీ యంత్రాలతో ప్రయత్నించినా... విగ్రహం ఒక్క అంగుళం కూడా కదల్లేదు. ఈ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో చోటుచేసుకుంది. కంతాల్ చౌరాహా – ఛత్రీ చౌక్ రహదారిపై ఉన్న 'ఖడే హనుమాన్' ఆలయానికి దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతుంటారు. 2028లో జరగబోయే 'సింహస్థ కుంభమేళా' కోసం నగరంలో మౌలిక వసతుల విస్తరణ, రోడ్ల వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుణ్యకాలంలో క్షిప్రా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు పరమశివుడి క్షేత్రమైన ఉజ్జయినికి తరలివస్తారు. అందులో భాగంగానే రహదారి విస్తరణ చేపట్టగా.. పురాతన ఆలయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉజ్జయిని మునిసిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం ఈ విగ్రహాన్ని టాంకీ చౌక్ సమీపంలో నూతనంగా నిర్మించే ప్రాంతానికి సురక్షితంగా తరలించాలని ప్రణాళిక రచించాయి. ఆలయాన్ని పూర్తి స్థాయిలో తొలగించినప్పటికీ, నిలబడి ఉన్న హనుమంతుని విగ్రహం మాత్రం ఉన్న చోటు నుంచి కదల్లేదు. అధికారులు, కార్మికులు భారీ యంత్రాల (జేసీబీలు, క్రేన్లు) సహాయంతో విగ్రహాన్ని తరలించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. స్థానిక మీడియా నివేదిక ప్రకారం, గత కొద్ది రోజుల్లో నాలుగుసార్లు జరిపిన ప్రయత్నాలు విఫలం కావడంతో, అధికారులు భారీ యంత్రాల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు**'దైవ లీల'గా ప్రచారం** విగ్రహాన్ని కదిలించడంలో అధికారులు విఫలమవడంతో ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అనేకమంది దీనిని దైవ లీలగా అభివర్ణిస్తున్నారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణం వద్దకు పెద్ద ఎత్తున కోతులు గుమిగూడిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో నమ్మకం మరింత బలపడింది. ఆలయ అర్చకుడు మహేష్ బైరాగి మాట్లాడుతూ.. వరుసగా జరుగుతున్న ఈ విఫల యత్నాలు స్వామివారు ఇక్కడే ఉండాలనుకుంటున్నారనడానికి సంకేతమని అన్నారు. "హనుమంతుడు ప్రతిరోజూ తాను ఇక్కడే ఉండాలనుకుంటున్నట్లు సంకేతాలు ఇస్తున్నారు.. అధికార యంత్రాంగం ఈ సంకేతాలను అర్థం చేసుకోవాలని నేను వినమ్రంగా వేడుకుంటున్నాను. ఒకవేళ విగ్రహాన్ని తొలగించాల్సి వస్తే, అది ఎటువంటి దెబ్బతినకుండా ప్రస్తుతం ఏ రూపంలో ఉందో అదే విధంగా భద్రంగా తరలించాలి.

## ఈవీల కోసం ఎగబడుతున్న జనం

**ముంబై,సెప్టెంబర్ 9:** రోజురోజుకూ వాహన కొనుగోలుదారుల అభిరుచి మారిపోతోంది. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలను కొనేందుకు జనం అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ క్రమంగా ఇవి జోరందుకుంటున్నాయి. ఇప్పుడు ఆగస్ట్ నెలలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుబోయాయి. ఓవరాల్‌గా 2026 ఆగస్టులో ఈవీ రిటైల్ విక్రయాలు 2,98,448 యూనిట్లుగా నమోదయ్యాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంతో చూస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధి కనిపించింది. అంటే ఇప్పుడు సాధారణ పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ ఏ స్థాయిలో పెరిగిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సేల్స్ డేటాను విడుదల చేసింది. అయితే ఈ ఎలక్ట్రిక్ వాహనాల్లో కేవలం కార్లు మాత్రమే కాదు.. టూ వీలర్లు, 3 వీలర్లు, ప్యాసెంజర్ వాహనాలు, కమర్షియల్ వాహనాలు ఇలా అన్నీ ఉంటాయి. వీటి సేల్స్ 2025 ఆగస్టులో 1,95,250 యూనిట్లుగా ఉండేది. మొత్తంగా వాహనాల మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా 9.5 శాతం నుంచి ఇప్పుడు 12.3 శాతానికి చేరినట్లు ఫాడా వెల్లడించింది. ఇక్కడ సెగ్మెంట్ వారీగా దేంట్లో సేల్స్ ఎలా ఉన్నాయో చూద్దాం. ఎలక్ట్రిక్ టూ వీలర్ సెగ్మెంట్లో చూస్తే మొత్తంగా 1,83,204 వాహనాలు అమ్ముడుబోయాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడే 67.05 శాతం విక్రయాలు పెరిగాయి. జులైతో పోలిస్తే మాత్రం స్వల్పంగా 10.37 శాతం తగ్గడం గమనార్హం. ఇక ఎలక్ట్రిక్ ప్యాసింజర్ రిటైల్ వాహనాల విక్రయాలు గతేడాది ఆగస్టుతో పోలిస్తే 51.89 శాతం పెరిగి 30,696 యూనిట్లకు పెరిగాయి. జులైతో పోలిస్తే ఇక్కడ 6.78 శాతం తగ్గింది. ఇక్కడ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికిల్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ బ్రాండ్ నుంచే 13,158 యూనిట్లు అమ్ముడుబోవడం విశేషం. తర్వాత మహీంద్రా అండ్ మహీంద్రా 5464 యూనిట్ల విక్రయాలతో రెండో స్థానంలో ఉంది. త్రీ వీలర్ సెగ్మెంట్లో రిటైల్ వెహికిల్ సేల్స్ 79846 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే ఇక్కడ వృద్ధిఇ 25.28 శాతంగా నమోదైంది. ఇక ఇదే సమయంలో ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల రిటైల్ సేల్స్ దాదాపు మూడింతలయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఏకంగా 188.3 శాతం వృద్ధి చెంది ఇప్పుడు 4702 యూనిట్లకు చేరుకోవడం విశేషం. జులైతో పోలిస్తే కూడా ఇక్కడ 30 శాతానికిపైగా వృద్ధి నమోదైంది. భారత విద్యుత్ వాహనాల చరిత్రలోనే ఈ ఆగస్ట్ అత్యుత్తమంగా నిలిచినట్లు ఫాడా ప్రెసిడెంట్ సాయి గిరిధర్ తెలిపారు. పండగ సీజన్ కాకపోయినా, నాలుగు విభాగాల్లో ఈవీ సేల్స్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఈవీ ఆదరణకు అద్దం పడుతోందని చెప్పారు.

# భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!

యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం,



కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

## ఖాళీ కడుపుతో బెండకాయ

# నీరు తాగితే..?



మనకు సులభంగా దొరికే కూరగాయల్లో బెండకాయ ఒకటి. ఇది మన వంటకాల్లో తరచుగా వాడతాం. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు ఉన్న బెండకాయ నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు. బెండకాయను రాత్రి నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే శరీరానికి చాలా మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ దీన్ని ఎంత మోతాదులో తీసుకోవాలి, ఎవరు తాగాలి, ఎవరు తాగకూడదు అన్నదానిపై పూర్తి అవగాహన ఉండాలి. బెండకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. అజీర్తి లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బెండకాయలో గ్లూకోజ్ను శరీరం తీసుకోకుండా తగ్గించే గుణం ఉంది. ఇది షుగర్ను అదుపులో ఉంచడంలో సాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండెకు రక్షణ ఇస్తాయి. రక్తనాళాల్లో వాపు తగ్గి గుండె సంబంధిత సమస్యల నుంచి కాపాడుతుంది. బెండకాయలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ %ఖ% లాంటి పోషకాలు చాలా ఉంటాయి. ఇవి ఎముకలు గట్టిగా అయ్యేలా చేస్తాయి. ఈ నీళ్లు తాగిన తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని వల్ల ఆకలి తగ్గి ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దాంతో బరువు అదుపులో ఉంటుంది. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. ముడతలు, మొటిమలు తగ్గడంలో సాయపడతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. వాంతులు, గ్యాస్, కడుపు ఉబ్బరం.. ఎక్కువ ఫైబర్ వల్ల కొందరికి అజీర్తి లాంటి ఇబ్బందులు రావచ్చు. అలర్జీ వచ్చే అవకాశం.. కొందరు బెండకాయకు అలర్జీ కలిగి ఉంటారు. అలాంటి వారు ఈ నీటిని తాగకూడదు. ఫ్రక్టోజ్ వల్ల అసౌకర్యం.. బెండకాయలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల కొందరికి గ్యాస్, అసౌకర్యం కలగవచ్చు. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు జాగ్రత్త.. ఇందులో ఉండే ఆక్సలేట్ పదార్థం రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

బెండకాయ నీళ్ల తయారీ విధానం: ఐదు తాజా బెండకాయలు తీసుకోండి. వాటి చివర్లు కట్ చేసి మధ్యలో చీల్చండి. వీటిని రెండు గ్లాసుల నీటిలో రాత్రంతా నానబెట్టండి. ఉదయం ముక్కలను తీసివేసి ఆ నీటిని ఖాళీ కడుపుతో తాగండి. బెండకాయ నీళ్లు సహజంగా ఆరోగ్యాన్ని పెంచే ఒక మంచి మార్గం. కానీ దీన్ని రోజూ తీసుకునే ముందు మీ ఆరోగ్య పరిస్థితులను ఆలోచించుకోండి. అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

## ఈ అలవాట్లు ఉంటే

# పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..



కొంత మంది పాతికేళ్లకే నలభై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు. ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి. దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి.

ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది. ముఖంపై మచ్చలు లేదా కళ్ళ కింద నల్లటి వలయాలకు దారితీస్తుంది. ఒత్తిడిని నిర్వహించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి "భ్రమరి ప్రాణాయామం" చేయడం మంచి మార్గం.

## ఉదయాన్నే ఈ తెల్లటి

# రసం తాగి చూడండి..



ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది. అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది. బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది.

ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం. తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

# చియా సీడ్స్,

# నల్లఎండు ద్రాక్ష

## కలిపి నానపెట్టిన నీటితో ఇన్ని లాభాలా..?



వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా సీడ్స్ కలిపి తయారు చేసిన వాటర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర మరియు ప్రోటీన్ కలిగి ఉంటాయి, ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.

# జ్వరానికి అసలు కారణం ఏంటి..?

మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్.



చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం. గోరువెచ్చని నీళ్లు తాగడం. చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

## శ్రీశైలంలో దసరా మహోత్సవాల
# ఏర్పాట్లు షురూ

- విజయదశమి రోజున శమీపూజ, ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు - ఈఓ .శ్రీనివాసరావు



**శ్రీశైలం (ప్రశ్నన్యూస్)** శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో అక్టోబర్ 11 నుండి 20 వరకు జరగనున్న దసరా మహోత్సవాల నిర్వహణకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, అధ్యాపకులు, వేదపండితులు, శాఖాధిపతులు,వివిధ విభాగాల పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉత్సవాలలో శ్రీస్వామి అమ్మవార్లకు జరిపించాల్సిన కైంకర్యాలు, వాహన సేవలు,అమ్మవారి ఉత్సవమూర్తికి నవదుర్గా అలంకరణలు, విజయదశమి రోజున నిజరూపాలంకరణ, శమీపూజ, ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు,వాహనాల పార్కింగ్,క్యూలైన్ల క్రమబద్ధీకరణ, దర్శన ఏర్పాట్లు,అన్నప్రసాద వితరణ,సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు వంటి అంశాలు ప్రాథమికంగా చర్చించబడ్డాయి. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ రాబోయే ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవ నిర్వహణ గురించి కూలంకషంగా చర్చిస్తామన్నారు. అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఉత్సవ రోజులలో వైదిక కార్యక్రమాలన్నీ సమయపాలన పాటిస్తూ పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని పరిపాలనా విభాగానికి ఆదేశించారు. భక్తులు ఉత్సవ విశేషాలను వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు, సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని, విద్యుద్దీపాలంకరణ, పుష్పాలంకరణ చేయాలని ఇంజనీరింగ్, ఉద్యానవన విభాగాలను ఆదేశించారు. రద్దీ రోజులలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామోత్సవ వీధుల్లో వాహనాలను నియంత్రించాలని భద్రతా విభాగానికి సూచించారు. పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజా శౌచాలయాలను ఎప్పటికప్పుడు శు భ్రపరచాలని,భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ, మంచినీరు, అల్పాహారం అందించాలని సంబంధిత విభాగాలను, అలాగే ఉత్సవాల విశేషాలపై సామాజిక, ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, నిత్య కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవంలో కోలాటం, చెక్కభజన, డోలు వాయిద్యాలు వంటి జానపద కళారూపాల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ప్రజాసంబంధాల విభాగాన్ని ఆదేశించారు.

## చదువుతో పాటు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరం

- 200 మంది విద్యార్థులకు ఏబీసీ 3.0 అవగాహన
- నన్ను నేను తెలుసుకోవడం.. వ్యక్తిత్వ వికాసం.. బాధ్యతాయుత ప్రవర్తనపై ప్రత్యేక శిక్షణ
- జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) చదువుతో పాటు విద్యార్థులకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని, తద్వారా వారు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొని సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి అన్నారు. బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏబీసీ 3.0 అవగాహన కార్యక్రమాన్ని మెదక్ పట్టణంలోని గవర్నమెంట్ బాయ్స్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమ భార్గవి మాట్లాడుతూ నన్ను నేనుతెలుసుకోవడం,వ్యక్తిత్వం, వ్యక్తిత్వ వికాసం, బాధ్యతాయుత ప్రవర్తన, సరైన నిర్ణయాలు తీసుకోవడం, తమ బలాలు--బలహీనతలను గుర్తించడం తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఇతరుల ప్రభావానికి లోనుకాకుండా స్వతంత్రంగా ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకునేలా విద్యార్థులను చైతన్యపరిచామన్నారు. పిల్లల రక్షణ కోసం అందుబాటులో ఉన్న చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై విద్యార్థులకు వివరించారు. బాలలకు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా సంబంధిత సహాయ వ్యవస్థలను ఆశ్రయించాలని సూచించారు విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. చిన్న వయస్సు నుంచే సరైన ఆలోచనా విధానం, బాధ్యతాయుత ప్రవర్తన అలవర్చుకుంటే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగగలరని పేర్కొన్నారు. లైఫ్ స్కిల్స్ ట్రైనర్, ఏబీసీ 3.0 ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత రాకేష్ కొర్రపాటి మాట్లాడుతూ, విద్యార్థుల్లో కేవలం సమాచారాన్ని పెంచడం మాత్రమే కాకుండా, వారి ఆలోచనా విధానంలో సానుకూల మార్పు తీసుకురావడమే ఏబీసీ 3.0 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు తమను తాము అర్థం చేసుకుని, తమ సామర్థ్యాలను గుర్తించి, జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేలా జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవగాహనతో ఆలోచన మారాలి.. ఆలోచనతో ప్రవర్తన మారాలి.. ప్రవర్తనతో భవిష్యత్తు మారాలి'' అనే లక్ష్యంతో ఏబీసీ 3.0 కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన, సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించే దిశగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మల్లేశం ఉపాధ్యాయులు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## మనం అంగన్వాడి -మన బాధ్యత

- తొమ్మిదవ జాతీయ పోషణ మాసం పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాట్లాడుతూ..మనం అంగన్వాడి – మన బాధ్యత అని,సెప్టెంబరు 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ మాసంలో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మాతా, శిశు సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వాలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిశీలనకు 'పోషణ్ అభియాన్'ను నిర్వహిస్తున్నామన్నారు. వారు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. అనంతరం 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఈఓ రాజు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.(

# అసెంబ్లీ గొడవలకు"కేసీఆరే" సూత్రధారి

- కేటీఆర్,హరీష్,తాతా మధు,నవీన్ రెడ్డిలు పాత్రధారులు
- సిగ్గు లేకుండా మహిళల ముందు చొక్కలు విప్పుకొని తిరిగారు
- తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలి
- నవీన్‌రెడ్డి అనుచిత, దురహంకార వ్యాఖ్యలు ఖండనీయం
- కెసిఆర్ ఫామ్ హౌస్ ముందు చావు డబ్బు కొడితే పసుపు నీళ్లు చల్లుకున్నారు
- దళిత స్పీకర్ ను ఘోరంగా అవమానించారు
- కేసీఆర్ ఇచ్చిన దళిత హామీలు ఏమయ్యాయి.?
- ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలి
- విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు



**బోడుప్పల్(ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి శాశ్వతంగా తొలగించాలని, నవీన్‌రెడ్డి చేసిన అనుచిత,దురహంకార వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు డిమాండ్ చేశారు. బోడుప్పల్ సర్కిల్ లోని ఫెడరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, ప్రజలను,సామాజిక వర్గాలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని రాపోలు రాములు అన్నారు. తాతా మధు,నవీన్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేసిన వారిపై పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ దళిత హామీలు ఏమయ్యాయి..?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని రాపోలు రాములు ప్రశ్నించారు. దళితులకు ముఖ్యమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటి అమలులో ఎంతవరకు చిత్తశుద్ధి చూపిందో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. దళితులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన లెక్కలు చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉందన్నారు. ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్.. అధికారంలో ఉన్న సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేసీఆర్ ఇప్పుడు ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని రాపోలు రాములు విమర్శించారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా రాజకీయాలు చేయడం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రజల సమస్యలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలను కలవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని,ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందని రాపోలు రాములు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా,ఇతర పార్టీలపై విమర్శలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. ఈ సందర్భంగా తాతా మధు,నవీన్‌రెడ్డి వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాపోలు రాములు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,అధ్యక్షుడు అబ్రహం లింకన్,ప్రధాన కార్యదర్శి గడ్డం యాదగిరి,కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్,సభ్యులు రామకృష్ణారెడ్డి,మహేష్, మధుసూదన్,ఎర్ర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్య కాదు... ఆశకు ఒక అవకాశం ఇవ్వాలి

## - ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం -- సెప్టెంబర్ 10 సందర్భంగా

మనిషి జీవితంలో కొన్ని క్షణాలు ఎంతో భారంగా అనిపిస్తాయి. సమస్యలు వరుసగా ఎదురైనప్పుడు, మార్గం కనిపించనప్పుడు "ఇక నా జీవితంలో ఏమీ మారదు" అనే ఆలోచన కలగవచ్చు. అయితే ఒక కష్టమైన పరిస్థితి శాశ్వతం కాదు. ఆ క్షణంలో కనిపించని మరో మార్గం ఉండవచ్చు. అందుకే ఆత్మహత్యల నివారణ అనేది కేవలం ఒక రోజు నిర్వహించే అవగాహన కార్యక్రమం కాకుండా, కుటుంబం మరియు సమాజం మొత్తం బాధ్యతగా తీసుకోవాల్సిన అంశం. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహిస్తారు. ఆత్మహత్య గురించి ఉన్న మౌనం, అపోహలు, నిందల నుంచి బయటకు వచ్చి అవగాహన, సానుభూతి, సంభాషణ మరియు సహాయానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం.

### గణాంకాల వెనుక... ఎన్నో జీవితాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 7.2 లక్షలకు పైగా ప్రజలు ఆత్మహత్యతో మరణిస్తున్నారు. ముఖ్యంగా యువతలో కూడా ఇది తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోంది. అయితే ఈ సంఖ్యలను కేవలం గణాంకాలుగా చూడటం సరిపోదు. ప్రతి సంఖ్య వెనుక ఒక మనిషి, ఒక కుటుంబం, ఎన్నో సంబంధాలు, చెప్పలేని ఒక కథ ఉంటాయి. అందుకే ఆత్మహత్యల నివారణలో గణాంకాలతో పాటు, బాధలో ఉన్న వ్యక్తిని గుర్తించడం, వినడం, అర్థం చేసుకోవడం మరియు సరైన సమయంలో సహాయం అందించడం ఎంతో ముఖ్యమైనది.

### ఆత్మహత్యకు ఒక్క కారణమే ఉండదు

ఆత్మహత్య ఆలోచనలు రావడానికి ఒకే ఒక్క కారణం ఉండదు. కుటుంబ సమస్యలు, సంబంధాల్లో ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, అవమాన భావన, వైఫల్యం, తీవ్రమైన మానసిక వేదన వంటి అనేక అంశాలు ఒకదానితో ఒకటి కలిసిపోవచ్చు. అందువల్ల "అతనికి అంత మంచి జీవితం ఉంది కదా... మరి ఎందుకు ఇలా ఆలోచించాడు?" అని ప్రశ్నించడం కంటే, "అతను అనుభవిస్తున్న బాధ ఏమిటి"? అని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

### సంకేతాలను గమనించాలి

ఒక వ్యక్తి అకస్మాత్తుగా అందరితో దూరంగా ఉండటం, నిరాశ లేదా నిస్సహాయత గురించి మాట్లాడటం, "నావల్ల ఎవరికీ ఉపయోగం లేదు" వంటి మాటలు చెప్పటం, గతంలో ఇష్టపడిన విషయాలపై ఆసక్తి కోల్పోవడం, వంటి మార్పులను కుటుంబ సభ్యులు గమనించాలి. (మరణం గురించి మాట్లాడటం లేదా జీవితం పై ఆశ కోల్పోయినట్లు వ్యక్తం చేయడం వంటి సంకేతాలను కూడా తేలికగా తీసుకోకూడదు.
ఇలాంటి సమయంలో "అలా ఆలోచించకు", "నీకు ఏం తక్కువ", "ఇతరులకు ఇంకా పెద్ద సమస్యలు ఉన్నాయి"అని చెప్పడం కంటే, ప్రశాంతంగా విని, తీర్పు ఇవ్వకుండా మాట్లాడటం అవసరం.

### ఒక సంభాషణ... ఒక జీవితానికి తోడు

ఎవరైనా తీవ్రంగా బాధపడుతున్నట్లు కనిపిస్తే వారి దగ్గర కూర్చుని "నువ్వు ఎలా ఫీల్ అవుతున్నావో చెప్పు... నేను వినడానికి ఉన్నాను" అని చెప్పడం ఎంతో విలువైన సహాయం కావచ్చు. వారి బాధలు చిన్నచూపు చూడకుండా, ఒంటరిగా వదిలేయకుండా, అవసరమైతే కుటుంబ సభ్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు లేదా అత్యవసర సహాయ వ్యవస్థలలో వెంటనే సంప్రదించాలి. ప్రొఫెషనల్ సహాయం తీసుకోవడం బలహీనత కాదు. అది తన జీవితాన్ని కాపాడుకోవడానికి తీసుకునే బాధ్యతాయుతమైన నిర్ణయం.

### మౌనం కాదు... మనస్ఫూర్తిగా మాట్లాడాలి

ఆత్మహత్య గురించి సున్నితంగా మరియు బాధ్యతగా మాట్లాడటం ద్వారా అపోహలను తగ్గించవచ్చు. ముఖ్యంగా కుటుంబాల్లో "మానసిక సమస్యలను బయటకు చెప్పకూడదు" అనే భావనను మార్చాల్సిన అవసరం ఉంది. ఎవరైనా బాధలో ఉన్నప్పుడు వారికి సలహా ఇవ్వడానికి అన్నా ముందు వారి మాట వినడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనం సమస్యను వెంటనే పరిష్కరించలేకపోయినా, వారి బాధలో వారికి తోడుగా ఉండగలం. ఒక ఫోన్ కాల్, ఒక చిన్న ప్రశ్న, శ్రద్ధగా వినయ్ ఒక చెవి, "నేను నీతో ఉన్నాను" అని ఒక మాట కూడా ఒక వ్యక్తికి ఎంతో విలువైనదిగా అనిపించవచ్చు.



రాధిక సోమ, సైకాలజికల్ కౌన్సిలర్
సెరినిటి స్పేస్ కౌన్సిలింగ్ సెంటర్
9347166650

### చివరి సందేశం

ఆత్మహత్య ఒక సమస్యకు పరిష్కారం కాదు... కానీ సరైన సమయంలో అందిన సహాయం ఒక జీవితానికి దారి చూపగలదు.
మాట్లాడండి...
వినండి...
అర్థం చేసుకోండి...
తోడుగా నిలబడండి.
ప్రతి ప్రాణం విలువైనదే.
ప్రతి జీవితానికి , ఆశకు ఒక అవకాశం ఉంది.

## మయూర ఇండియా కంపెనీ ఉద్యోగుల అర్ధ నగ్న నిరసన 24 రోజులకు చేరిన ఆందోళనలు

- యాజమాన్యం స్పందించకపోవడంపై కార్మికుల ఆగ్రహం
- యాజమాన్యం వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై అర్ధ నగ్న నిరసన




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని మయూర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్మికులుఅర్ధ నగ్న నిరసనకు దిగారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 24 రోజుల నుండి ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన కంపెనీ యాజమాన్యం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఆ కంపెనీ కార్మికులు అర్ధ నగ్న నిరసన కు దిగారు. జాతీయ రహదారిపై అర్ధ నగ్న నిరసన తెలుపుతూ కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగానినాదాలు చేశారు. చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పై తక్షణమే చర్చలు జరిపి న్యాయబద్ధమైన వేతన ఒప్పందం కుదురుచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనికార్మికులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని, వేధింపులను వెంటనే నిలిపివేయాలని, డిస్మిస్ చేసిన వైస్ ప్రెసిడెంట్ కే బాల మల్లేష్ ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, 20 22 సంవత్సరంలో కోత విధించిన ఇన్సెంటివ్స్ వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు కార్మికుల సమ్మె ను కొనసాగిస్తామని కార్మికులు పేర్కొన్నారు. యాజమాన్య మొండివైఖరిని ఖండిస్తున్నామని కార్మికులు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ మంచి అవకాశమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అన్నారు. ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల్లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను ఇరుపక్షాల పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఎస్పీ తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ఇరువర్గాల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, ఆస్తి, కుటుంబ, వైవాహిక వివాదాలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, సైబర్ సంబంధిత రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా చట్టపరమైన నిబంధనల మేరకు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. వివాదాలను కక్షలుగా మార్చుకుని ఇరువర్గాలు సమయం, ధనం కోల్పోవద్దని ఎస్పీ సూచించారు. 'రాజీ మార్గమే రాజమార్గం' అనే విషయాన్ని గుర్తించి లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి సంబంధిత పక్షాలకు అవగాహన, కౌన్సెలింగ్ కల్పిస్తూ పరిష్కారానికి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కృషి చేస్తారని తెలిపారు. కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.

# 'ఎపిక్' ఫిల్మోగ్రఫీలో అందమైన చిత్రంగా నిలుస్తుంది: విజయ్ దేవరకొండ



బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. '90ం' వెబ్ సిరీస్‌తో సంచలనం సృష్టించిన ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా వెండితెరకు పరిచయమవుతున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. ఈ వేడుకలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. "90ం సిరీస్ చూసినప్పుడే, దర్శకుడు ఆదిత్యతో సినిమా చేయాలనిపించింది. తరుణ్ భాస్కర్ మొదటి సినిమా కోసం ఎలా ఎదురుచూశానో, ఆదిత్య డెబ్యూ కోసం కూడా అలాగే ఎదురుచూశాను. అలాంటి దర్శకుడి మొదటి సినిమాలో నటించే అవకాశం ఆనంద్‌కు రావడం అదృష్టం. తన సినిమాల ఎంపిక చూస్తే గర్వంగా ఉంటుంది. 'ఎపిక్' చిత్రం ఆనంద్ ఫిల్మోగ్రఫీలో ఒక అందమైన సినిమాగా నిలుస్తుందని నమ్ముతున్నాను" అని అన్నారు. తెలుగు సినిమా ఈ ఏడాది అద్భుతంగా రాణిస్తోందని, 'ఎపిక్' తో మొదలుపెట్టి వరుస బ్లాక్‌బస్టర్లు చూడబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ, "ఆనంద్ ఐటీ జాబ్ చేసే రోజుల్లోనే సినిమాలపై తనకున్న పిచ్చి చూసి ఆశ్చర్యపోయాను. ఏ పాత్రలోనైనా సహజంగా ఒదిగిపోతాడు.

దర్శకుడు ఆదిత్య రచనలో ఎంతో అనుభవం కనిపిస్తుంది. టీజర్, ట్రైలర్ బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. ట్రైలర్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కొన్ని నెగెటివ్ కామెంట్స్‌పై నిర్మాత నాగవంశీ, దర్శకుడు ఆదిత్య హాసన్ స్పందించారు. "నిజ జీవితంలో ఒక అబ్బాయి, అమ్మాయి మధ్య ప్రేమ ఎలా ఉంటుందో అదే స్వచ్ఛంగా చూపించాం. ఇది కుటుంబంతో కలిసి హాయిగా చూసే సినిమా. ఇందులో అశ్లీలతకు తావులేదు" అని నాగవంశీ స్పష్టం చేశారు. తనపై ప్రేక్షకులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఆదిత్య హాసన్ భరోసా ఇచ్చారు. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, "ఇది మనందరి కథ. ట్విస్టులు, రక్తపాతాలు లేకుండా సహజంగా సాగే ప్రేమకథ. అన్నయ్య విజయ్, సందీప్ రెడ్డి గారు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. కథానాయిక వైష్ణవి చైతన్య తన 'కడలి' పాత్ర ద్వారా ఎంతో నేర్చుకున్నానని, సందీప్ రెడ్డి సినిమాలో ఉండే హీరోయిన్ లాంటి బలమైన పాత్ర ఇదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు. 'ఎపిక్' సెప్టెంబర్ 11న థియేటర్లలో విడుదల కానుండగా, సెప్టెంబర్ 10న ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

# ఘనంగా 'కళ్యాణం కమనీయం జీవితం' ట్రైలర్ లాంఛ్.. ఈ నెల 18న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్!



టాలీవుడ్‌లో ప్రతిభావంతులైన యువ నటీనటులు, కొత్త ఆలోచనలతో వస్తున్న టెక్నీషియన్లను ప్రోత్సహించే చిత్రాలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఆ కోవలోనే యూత్ మరియు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఏకకాలంలో అలరించే సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తోన్న చిత్రం "కళ్యాణం కమనీయం జీవితం". వివిపై మీడియా ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై పైలా ప్రసాద్ రావు, కిషోర్ గుండాల సంయుక్తంగా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ చిత్రాన్ని నిర్మించారు. రవి లోకిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఖాన్ దురాని, సాహితి ఆవంచ జంటగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఈ నెల 18న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ రాజవంశీ అత్యంత భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను నిర్వహించింది. టాలీవుడ్ ప్రముఖ స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్, ప్రముఖ నిర్మాతలు కేఎల్ దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి సందడి చేశారు. ఈ వేడుకలో చిత్ర బృందం పంచుకున్న ఆసక్తికర విశేషాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. సమాజంలో నేడు సర్వసాధారణంగా మారుతున్న భార్యాభర్తల బంధాలు, వాటి మధ్యలోకి ఒక మూడో వ్యక్తి ప్రవేశం వల్ల వచ్చే మనస్పర్థలు, ఆ సవాళ్లను ఎదుర్కొంటూ ఆ జంట తమ ప్రేమను, బంధాన్ని ఎలా నిలబెట్టుకున్నారు అనే సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఎక్కడా అసభ్యతకు తావులేకుండా, కుటుంబం అంతా కలిసి నవ్వుతూ, భావోద్వేగానికి గురవుతూ చూసేలా ఈ క్లీన్ ఫ్యామిలీ అండ్ లవ్ ఎంటర్‌టైనర్‌ను రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. ఈ వేడుకలో నిర్మాత పైలా ప్రసాద్ రావు మాట్లాడుతూ, తాము యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినప్పటికీ సినిమాపై ఉన్న మక్కువతో గతంలో '24 కిస్సెస్' చిత్రాన్ని నిర్మించామని, ఇప్పుడు కొత్తవారితో మరింత ఇన్నోవేటివ్ కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించాలనే తపనతో ఈ సినిమా చేశామని తెలిపారు. వ్యాపార లెక్కలకంటే మంచి సినిమా తీయాలనే ప్యాషన్‌తో పనిచేశామని, ఈ చిత్రంలోని లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను కచ్చితంగా కదిలిస్తాయని పేర్కొన్నారు. మరో నిర్మాత కిషోర్ గుండాల మాట్లాడుతూ, ఈ సినిమా పోస్టర్‌ను లెజెండరీ రైటర్ విజయేంద్రప్రసాద్ విడుదల చేయడం, సాంగ్‌ను ఆస్కార్ విన్నర్ చంద్రబోస్ లాంఛ్ చేయడం తమ అదృష్టమని, నేడు వినాయక్ గారు అతిథిగా రావడం ఈ ఈవెంట్‌కు మరింత ప్రత్యేకత తెచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో వచ్చే ట్విస్టులు ప్రేక్షకులను సీట్ల అంచుల మీద కూర్చోబెడతాయని ధీమా వ్యక్తం చేశారు. స్టార్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ, కొత్త దర్శకులకు, అభిరుచిగల నిర్మాతలకు పరిశ్రమలో అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రసాదరావు, కిషోర్ వంటి నిర్మాతలు ఇండస్ట్రీకి ఎంతో అవసరమని, ఈ సినిమా పెద్ద విజయం సాధించి ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని మనసారా ఆశీర్వదించారు. నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అనే తేడా లేకుండా ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే చాలా రిచ్‌గా, ప్రామిసింగ్‌గా ఉందని కొనియాడారు. ప్రొడ్యూసర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ఈ చిత్రం నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా ఒక 'అర్జున్ రెడ్డి' లేదా 'బేబి' రేంజ్ ఇంపాక్ట్ ఇచ్చేలా కంటెంట్‌తో వస్తోందని, ఈ ప్రయత్నం తప్పకుండా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ మురళీ కార్తికేయ మాట్లాడుతూ, తాను అందించిన ట్యూన్స్ మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు తగినంత సమయం దొరకడంతో అద్భుతమైన అవుట్‌పుట్ వచ్చిందని, లిరిక్స్ కూడా సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని తెలిపారు. దర్శకుడు రవి లోకిరెడ్డి మాట్లాడుతూ, తన కెరీర్‌లో ఎదురైన ఇబ్బందికర పరిస్థితులను దాటుకుని ఈ సినిమాతో ఒక మంచి సువర్ణావకాశం దక్కించుకున్నానని, రచయిత ఎన్.సి. అరవింద్ ఏకలవ్య అందించిన అద్భుతమైన పాయింట్‌కు స్క్రీన్ ప్లే తోడై సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లిందని తెలిపారు. ప్రముఖ నటుడు సత్యానంద్ ఇందులో ఒక కీలక పాత్ర పోషించడం తమ చిత్రానికి అదనపు బలం అని పేర్కొన్నారు.

## హిందీ మన జాతీయ భాష అన్న శివరాజ్‌కుమార్ పై కన్నడిగుల ఆగ్రహం



తన పాన్-ఇండియా చిత్రం 'ఒరిజినల్ మాన్‌స్టర్' టైటిల్ లాంచ్ కార్యక్రమంలో కన్నడ ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ హిందీ భాషపై చేసిన వ్యాఖ్యలు కన్నడిగుల్లో అసంతృప్తికి దారితీశాయి. హిందీలో డైలాగులు చెప్పడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... హిందీ చాలా సులువైన భాష అని, అది మన రెండో భాషతో పాటు 'జాతీయ భాష' అని, తనకు హిందీ బాగా వచ్చని పేర్కొన్నారు. ఈ వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడంతో కన్నడిగులు, కన్నడ సంస్కృతీ పరిరక్షకులు ఆయన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారతదేశానికి ఎలాంటి అధికారిక 'జాతీయ భాష' లేదని, అన్ని ప్రాంతీయ భాషలకు సమాన ప్రాధాన్యం ఉందనే స్పృహ లేకుండా కన్నడ నాట దిగ్గజ కుటుంబానికి చెందిన హీరో ఈ రకమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని నెటిజన్లు మండిపడుతున్నారు. దివంగత లెజెండరీ నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ కన్నడ భాషా ఉద్యమాల్లో నిర్వహించిన పాత్రను గుర్తుచేస్తూ, శివరాజ్‌కుమార్ మాటలు వింటే ఆయన ఆత్మ నిరాశ చెందుతుందని పలువురు కామెంట్లు చేస్తున్నారు.

# రూ.200 కోట్ల 'ఇరుముడి' ఓటీటీలోకి..

## రవితేజ బ్లాక్‌బస్టర్ ఎక్కడ, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అంటే?



ఓటీటీ ప్రేక్షకులకు అదిరిపోయే గుడ్‌న్యూస్. థియేటర్లలో సంచలన విజయాన్ని అందుకున్న మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఎమోషనల్ డ్రామా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో సత్తా చాటింది. ముఖ్యంగా రవితేజను మాస్ హీరోగా మాత్రమే కాకుండా ఒక బలమైన ఎమోషనల్ నటుడిగా చూపించిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంది. ఇప్పుడు థియేట్రికల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ మూవీ.. ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.కొత్త సినిమాలు చూడండి 'నిన్ను కోరి', 'మజిలీ' వంటి ఎమోషనల్ కథలను తెరకెక్కించిన దర్శకుడు శివ నిర్వాణ.. రవితేజతో 'ఇరుముడి'ని తెరకెక్కించారు. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమాకు పాజిటివ్ పబ్లిక్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్లు స్థిరంగా కొనసాగాయి. ఇతర సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ.. 'ఇరుముడి' మాత్రం సుదీర్ఘంగా థియేటర్లలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకున్నట్లు సమాచారం. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా మరో భారీ విజయంగా నిలిచింది. రవితేజ అంటే మాస్, కామెడీ, ఎనర్జిటిక్ యాక్షన్ అనే ఇమేజ్ ప్రేక్షకుల్లో బలంగా ఉంది. అయితే 'ఇరుముడి'లో శివ నిర్వాణ ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. కుటుంబ బంధాలు, తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, భావోద్వేగాల చుట్టూ కథను నడిపించిన తీరు ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేసిందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా రవితేజ నటనలోని ఎమోషనల్ షేడ్స్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌పై ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'ఇరుముడి' డిజిటల్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. సెప్టెంబర్ 18 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. అయితే స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో 'ఇరుముడి'కి ప్రధాన బలంగా నిలిచిన అంశాల్లో రవితేజ నటనతో పాటు చిన్నారి నక్షత్రతో ఆయనకు సంబంధించిన ఎమోషనల్ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఈ సన్నివేశాలు ప్రేక్షకులను కదిలించాయని టాక్ వచ్చింది.

## ఈ ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి వస్తున్న మూవీస్ ఇవే!



ప్రతి ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి కొన్ని సినిమాలు దిగిపోతూనే ఉన్నాయి. తమిళ .. మలయాళ సినిమాలు, తెలుగు ఆడియోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అలా ఈ వారం ఇక్కడ వాలిపోయిన సినిమాల జాబితాలో, ముందుగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కనిపిస్తుంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, సూర్య - మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించారు. ఆగస్టు 14వ తేదీన విడుదలైన ఈ సినిమా, 250 కోట్లకి పైకి వసూళ్లను రాబట్టింది. ఈ నెల 11వ తేదీ నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో ఐదు భాషల్లో అందుబాటులోకి రానుంది. విశాల్ హీరోగా నటించిన 'మకుటం' సినిమా కూడా ఈ నెలలోనే ఓటీటీకి వచ్చేస్తోంది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ యాక్షన్ డ్రామా, ఆగస్టు 14వ తేదీన థియేటర్లకు వచ్చింది. విశాల్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాలో, ఆయన సరసన నాయికలుగా అంజలి .. దుషారా విజయన్ అలరించారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్' ఓటీటీకి రావడానికి సిద్ధమవుతోంది. ఇది విశాల్ దర్శకత్వం వహించిన సినిమా కావడం మరో విశేషం. ఇక మలయాళం నుంచి 'వరవు' అనే సినిమా కూడా ఈ నెల 11వ తేదీన బరిలోకి దిగిపోతోంది. 'జీ 5' వారు ఈ సినిమా ఓటీటీ హక్కులను దక్కించుకున్నారు. షాజీ కైలాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, జోజు జార్జ్ కథానాయకుడిగా నటించాడు. మిగతా ముఖ్యమైన పాత్రలలో, మురళి గోపి .. అర్జున్ అశోకన్ .. దీపక్ పరంబోల్ కనిపించనున్నారు. జులై 16న థియేటర్లకు వచ్చిన ఈ సినిమాకి, పాజిటివ్ టాక్ వచ్చింది. మరో

# 'ది ప్యారడైజ్' రిలీజ్‌పై క్లారిటీ..

## ఫస్ట్ డే నుంచే రికార్డ్ బుకింగ్స్‌కు నాని మూవీ రెడీ!



నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాపై మరో కీలక అప్‌డేట్ వచ్చేసింది. కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీపై రకరకాల వార్తలు వినిపిస్తుండగా.. తాజాగా వాటన్నింటికీ చెక్ పెడుతూ మూవీ టీమ్ మరోసారి రిలీజ్ డేట్‌ను ఖరారు చేసింది. ముందుగా ప్రకటించినట్టుగానే 2026 సెప్టెంబర్ 24న 'ది ప్యారడైజ్' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే అమెరికాలో ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-సేల్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. బుకింగ్స్ ఓపెన్ అయిన కొద్ది గంటల్లోనే భారీ స్పందన రావడం విశేషంగా మారింది. దీంతో నాని సినిమాపై ఉన్న క్రేజ్ ఏ స్థాయిలో ఉందో మరోసారి స్పష్టమవుతోంది. 'ది ప్యారడైజ్'కు యూఎస్‌లో ప్రీ-సేల్స్ ప్రారంభం కాగా.. బుకింగ్స్ ఓపెన్ అయిన కొన్ని గంటల్లోనే వి50ఖకు పైగా టికెట్ సేల్స్ నమోదైనట్లు సమాచారం. రిలీజ్‌కు ఇంకా సమయం ఉండగానే ఈ స్థాయిలో స్పందన రావడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.బుకింగ్స్‌కు వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే.. రానున్న రోజుల్లో ప్రీ-సేల్స్ మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా నాని మార్కెట్‌కు తోడు సినిమాపై ఇప్పటికే ఏర్పడిన భారీ హైప్ యూఎస్ బాక్సాఫీస్‌పై ప్రభావం చూపించే అవకాశం ఉందని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇక అమెరికాలో తెలుగు వెర్షన్‌కు సంబంధించి ఎర్లీ అవర్ ప్రీమియర్స్ కూడా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రిలీజ్ రోజునే యూఎస్‌లో సినిమాకు అదనపు షోలు, మంచి ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంది. నాని సినిమాలకు అమెరికాలో మంచి మార్కెట్ ఉండటంతో.. 'ది ప్యారడైజ్' విషయంలోనూ డిస్ట్రిబ్యూటర్లు భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రీ-సేల్స్ ఇదే జోరును కొనసాగిస్తే నాని కెరీర్‌లోనే ఈ సినిమా మరో భారీ ఓపెనర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే 'ది ప్యారడైజ్' ట్రైలర్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సినిమా ప్రపంచాన్ని, నాని క్యారెక్టర్‌ను, యాక్షన్ ఎలిమెంట్స్‌ను ట్రైలర్‌లో బలంగా చూపిస్తే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది.మరోవైపు పెండింగ్‌లో ఉన్న షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తి చేసేందుకు చిత్రబృందం వేగంగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి ఆలస్యం లేకుండా అన్ని పనులను పూర్తి చేసి సెప్టెంబర్ 24న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ ముందుకు సాగుతోంది.

# 'సిగ్మా' ఈవెంట్‌లో సీఎం విజయ్ కొడుకుకి గ్రాండ్ వెల్‌కమ్..

## 'టీవీకే.. టీవీకే' నినాదాలతో హోరెత్తిన వేదిక!



తమిళ సినీ రంగంలోనూ, రాజకీయ వాతావరణంలోనూ ప్రస్తుతం సీఎం విజయ్ కుటుంబానికి సంబంధించిన ఏ చిన్న వార్త అయినా క్షణాల్లో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. తాజాగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ తన మొట్టమొదటి దర్శకత్వ ప్రాజెక్ట్ అయిన 'సిగ్మా' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా సేలంలో జరిగిన ఓ భారీ ఈవెంట్‌లో పాల్గొన్నారు. అయితే ఈ వేడుకలో సినిమా విశేషాల కంటే అభిమానులు చేసిన హడావుడి, జేసన్ సంజయ్ చూపించిన సంయమనం అందరి దృష్టిని ఆకర్షించాయి. సేలంలో జరిగిన ఈ వేడుకకు భారీగా తరలివచ్చిన విజయ్ అభిమానులు ఒక్కసారిగా 'టీవీకే.. టీవీకే' అంటూ నినాదాలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. తన తండ్రి విజయ్ స్థాపించిన రాజకీయ పార్టీ పేరుతో అభిమానులు జోరుగా కేకలు వేస్తుండగా, వేదికపై ఉన్న జేసన్ సంజయ్ ఏమాత్రం తికమక పడకుండా ఎంతో ప్రశాంతంగా, చిరునవ్వుతో స్పందించారు. అభిమానులను చూస్తూ థంబ్స్ అప్ చూపించి అభివాదం చేయడంతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది.ఈ సందర్భంగా తన తొలి చిత్రం 'సిగ్మా' గురించి జాసన్ సంజయ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురయ్యే ఊహించని కష్టాలు, సవాళ్లు, వాటిని ఎదుర్కొంటూ సాగే ఓ సామాన్యుడి అద్భుతమైన ప్రయాణమే ఈ చిత్ర కథాంశం అని ఆయన తెలిపారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ సినిమా అక్టోబర్ 02న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది

# హిజ్రాల బలవంతపు వసూళ్లకు చెక్..

# 112కు కాల్ చేయండి

- ప్రజలకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సూచన..
- ఫిర్యాదు వస్తే తక్షణమే స్పందించాలని పోలీసులకు ఆదేశాలు




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** ఫంక్షన్లు, వివాహాలు, శుభకార్యాలు తదితర సందర్భాల్లో బలవంతంగా డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తే ప్రజలు ఇక నేరుగా 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. ఇలాంటి ఫిర్యాదులపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇటీవల ఒక ఘటనలో పోలీసుల సకాలంలో జోక్యంతో బలవంతంగా తీసుకున్న డబ్బును తిరిగి పొందడంతో పాటు బాధితులకు ఉపశమనం లభించింది. ఈ విషయాన్ని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుకు డీజీపీ స్పందిస్తూ, ఇలాంటి పరిస్థితులు ఎదురైతే ఆలస్యం చేయకుండా 112కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు.

### స్పెషల్ డ్రైవ్‌కు ఆదేశాలు

ఇదిలా ఉండగా, బలవంతపు వసూళ్లు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ ఇప్పటికే పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చారు. చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్ సమాజానికి గౌరవప్రదమైన జీవనం, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూడా చర్యలు కొనసాగుతున్నాయని సంబంధిత వార్తా కథనాలు పేర్కొన్నాయి.

### 112 సేవలకు మరింత సాంకేతిక బలం

ఇటీవల తెలంగాణ పోలీస్ AI ఆధారిత నూతన Dial-112 అత్యవసర స్పందన వ్యవస్థను ప్రారంభించింది. పోలీస్, ఫైర్, అంబులెన్స్, మహిళా భద్రత, బాలల రక్షణ తదితర అత్యవసర సేవలను ఒకే వేదిక ద్వారా సమన్వయం చేసేలా వ్యవస్థను రూపొందించారు. అత్యవసర కాల్స్‌పై వేగంగా స్పందించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు.

### ప్రజలకు ముఖ్య సూచన

ఎవరైనా బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరించడం లేదా ఇబ్బందులకు గురిచేయడం వంటి పరిస్థితి ఎదురైతే:వెంటనే 112కు కాల్ చేయాలి ఘటన జరిగిన ప్రదేశాన్ని పోలీసులకు స్పష్టంగా చెప్పాలి వీలైతే ఘటనకు సంబంధించిన ఆధారాలను భద్రపరచాలి పరిస్థితి ఉద్రిక్తంగా ఉంటే స్వయంగా గొడవకు దిగకుండా పోలీసుల సహాయం కోరాలి "చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు.. సమస్య ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వండి" అనే సందేశాన్ని ఈ తాజా ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# సియం చంద్రబాబు నాయుడే మా నాయకుడు బొజ్జల బృందమ్మ



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేసి నేటి బుధవారం మూడేళ్లు పూర్తైయింది. ఈ సందర్భంగా 'నిజం గెలిచింది' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్‌లో దీపాలు వెలిగించాలని, ఈరోజు బ్లాక్ డే పాటించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకోవడంతో శ్రీకాళహస్తిలో రాష్ట్ర పిలుపుమేరకు శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి వజ్రాల బృందమ్మ వారి స్వగ్రామం ఊరందరు గ్రామంలోని అలనాటి అరెస్టును వ్యతిరేకిస్తూ నిజం గెలిచింది అనే నినాదంపై కొవ్వొత్తులతో దీపం వెలిగించి , ఈ దీపం వెలుగులో కూటమి ప్రభుత్వంతోపాటు ప్రజలు సువిక్షంగా ఉండాలన్నారు బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ లిఅప్పటి ప్రతిపక్ష నేత నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నేటితో మూడేళ్లు: ప్రజాస్వామ్య చరిత్రలో నల్లరోజు అని ప్రతీ తెలుగువాడి గుండె ఘోషించింది. ఈ దృశ్యం చూసి కన్నీళ్లు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# నిజం గెలిచింది సంఘీభావం తెలిపిన రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య



**శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీకాళహస్తిలోనిబహదూర్ పేట నందు,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వర్యంలో 'నిజం గెలవాలి' నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దసరదాచారి పాల్గొనికొవ్వొత్తులతో దీపం వెలిగించి,అప్పటి అరెస్టుకు ఖండిస్తూ ఇప్పటి నిజం గెలిచింది కార్యక్రమానికి మద్దతు తెలియజేస్తూ,కొవ్వొత్తులతో దీపం వెలిగించి దీపం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని చంద్రబాబుకు సంఘీభావం తెలిపారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య మరియు దశరదాచారి మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన ఘటనను గుర్తుచేసుకుంటూ.. ఆ రోజును 'చీకటి రోజు'గా అభివర్ణించారు. యువనేత నారా లోకేష్ పిలుపు మేరకు 'నిజం గెలవాలి' అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించామనీ తెలియజేశారు.

# మాదాసు శ్రీనివాస్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** మర్కుక్‌లో నిన్న జరిగిన ధర్నాలో గాయపడి, అనంతరం పోలీసుల నిర్బంధానికి గురైన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అహ్మదిపూర్‌లో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నేతలు, మర్కుక్‌లో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బీఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న అణచివేత వైఖరి తదితర అంశాలపై నాయకులు చర్చించారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొంటూ, గత పదేళ్ల పాలనలో తెలంగాణ సుభిక్షంగా ఉందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, ఎంపీటీసీల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ మండల అధ్యక్షుడు బెందే మధు, మాజీ జడ్పీటీసీ మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, గొడుగు స్వామి, మాజీ ఎంపీటీసీ అశోక్, ఆకుల దేవేందర్, నాయకులు రమేష్ గౌడ్, మాతపల్లి సర్పంచ్ మహిపాల్, అహ్మద్, రాయవరం సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్పీ మహేష్ బి.గితే.



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) తేదీ:12-09-2026 నాడు జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు,వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ,విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ఎస్పీ తెలిపారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని సమయాన్ని , డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

- కాళోజీ జీవితం, రచనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం
- ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపల్స్ కమలా క్రిస్టియాన, డాక్టర్ జె. ఉమారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ ఎం. చంద్రశేఖర్ కార్యక్రమాన్ని పరిచయం చేస్తూ తెలంగాణ ప్రజలు ఎదుర్కొన్న అన్యాయాలు, అసమానతలు, నిజాం పాలనలోని దౌర్జన్యాలు, అప్పటి ప్రజల జీవన పరిస్థితులు, కాళోజీ నారాయణరావు జీవిత విశేషాలను వివరించారు. ముఖ్యఅతిథి ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు జీవితం, రచనలు నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం అధ్యాపకులు డాక్టర్ జయరాజు, డాక్టర్ సుజాత తెలంగాణ యాస ప్రత్యేకత, తెలంగాణ భాష గొప్పతనం గురించి వివరించారు. తెలుగు శాఖ అధ్యాపకురాలు సి.హెచ్. ఉమారాణి కాళోజీ రచనా విధానంలోని సూటిదనం, సామాజిక స్పృహను ఆయన కవితల ద్వారా విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు కాళోజీ రచనలపై ఉపన్యాసాలు, పాటలు, కవితలతో కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తమకు నచ్చిన కాళోజీ సూక్తులను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సరోజన, డాక్టర్ శ్రీలత, కస్తూరి, డాక్టర్ బాలచంద్రం, డాక్టర్ సౌజన్య, శ్రీధర్, శ్యామ్, భాస్కర్, విజయ్, రమాదేవి, సిరాజ్ తదితరులతో పాటు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# దళిత బహుజనుల ఆరాధ్య దైవం డా. బి.ఆర్. అంబేద్కర్

- హమారా ప్రసాద్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి
- దళిత సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి డా. చిప్పల యాదగిరి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రపంచ మేధావి, విశ్వరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళిత బహుజనుల ఆరాధ్య దైవమని, ఆయనను కించపరిచే విధంగా 'కల్పిత నాయకుడు' అనే పుస్తకాన్ని రచించి, ఈ నెల 18న ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర కార్యదర్శి డా. చిప్పల యాదగిరి డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించే విధంగా పుస్తకం రచించడాన్ని నిరసిస్తూ గజ్వేల్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా ఎవరైనా మాట్లాడినా, రాసినా సహించేది లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కులాల మధ్య ఘర్షణలకు కారణమయ్యే విధంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే దళిత, బహుజన, మైనారిటీ వర్గాలన్నీ ఏకమై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్ రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, అంబేద్కర్ సంఘం సీనియర్ నాయకులు పిడిచేడు లక్ష్మీనారాయణ, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు బ్యాగరి యాదగిరి, నాయకులు నీలమయ్య, రవీందర్, మల్లయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై ఉత్తమ రీల్స్ పోటీలు: కలెక్టర్ గరిమ అగ్రవాల్

- ఉత్తమ రీల్స్, వ్యూస్ ఉన్న వారికి నగదు బహుమతులు



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై ఉత్తమ రీల్స్, వ్యూస్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ వద్ద ఉన్న ఫారెస్ట్ అర్బన్ పార్క్, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ఉన్న వీ టీ ఏ డీ ఏ పార్క్, నాంపల్లి గుట్ట కు సంబంధించిన ఉత్తమ రీల్స్, ఎక్కువ వ్యూస్ వచ్చే వారు ఈ నెల 20 వ తేదీ వరకు పంపించాలని కోరారు. అర్బన్ ఫారెస్ట్ పార్క్, గుడి చెరువు బండ్ పార్క్, నాంపల్లి గుట్టలో పచ్చదనం, సందర్శకుల సౌకర్యార్థం కల్పించిన మౌలిక సదుపాయాలు, అటవీ సంపదపై విస్తృత ప్రచారం కల్పించి, సందర్శకులు వచ్చేలా సామాజిక మాధ్యమాల వేదికగా రీల్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆయా అంశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అందరినీ ఆకర్షించేలా రీల్స్ పోటీలను నిర్వహించాలని, ఆయా ప్రాంతాల విశేషాలు అందరికీ తెలిసేలా సృజనాత్మకంగా రీల్స్ రూపొందించి, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందుతుందన్నారు. ఈ పోటీలలో అత్యుత్తమంగా రీల్స్ రూపొందించిన వారిలో మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేల చొప్పున ప్రోత్సహకాలను అందజేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఉత్తమ రీల్స్ రూపొందించి.. ఎక్కువ వ్యూస్ వచ్చిన రీల్స్ లింక్ ఈ కింది ఫోన్ నెంబర్ 9440239783కు వాట్స్ అప్ చేయగలరని తెలియజేశారు.

# ఈనెల 11న జిల్లాలో తెలంగాణ ఆహార కమిషన్ పర్యటన

- జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ఈనెల 11న తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్, సభ్యులు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు .ఈ పర్యటనలో భాగంగా రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ( ఎం సి హెచ్ కిట్, జాతీయ ఆహార భద్రతా చట్టం - 2013, సెక్షన్ 4(బి ) కింద ప్రసూతి ప్రయోజనాల అమలు) పరిశీలించనున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రజలు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుపుటకు అవకాశం ఉంటుందనీ తెలియజేశారు. అనంతరం అదే రోజున మేడ్చల్ - మల్కాజిగిరి సమీకృత జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ లో సమీక్షా సమావేశం నిర్వహించబడుతుందని సంబంధిత అధికారులు తగిన సమాచారం రికార్డులతో సమీక్షా సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్

సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) అన్ని జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

అన్ని జిల్లాల్లో పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలు, జ్ఞాన భారతం మిషన్ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో హైదరాబాద్ నుంచి రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర యువజన, పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. పర్యాటక రంగం అభివృద్ధికి ప్రతి జిల్లాకు నోడల్ పర్యాటక అధికారులను నియమించాలని ఆదేశించారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గుర్తించిన ముఖ్యమైన, అభివృద్ధి చెందుతున్న పర్యాటక ప్రాంతాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, ఆపరేషన్, నిర్వహణ సిబ్బంది, సైన్‌బోర్డులు, సమాచార కియోస్క్‌లు, శిక్షణ పొందిన స్థానిక గైడ్లు, టికెటింగ్ సౌకర్యం, ఫుడ్ కోర్టులు, దివ్యాంగులకు అనుకూలమైన మార్గాలు, రహదారులు వంటి



సౌకర్యాలను ప్రాధాన్యతా క్రమంలో కల్పించాలని తెలిపారు. సినిమాల చిత్రీకరణకు అనుకూలమైన ప్రాంతాలు గుర్తించి, అభివృద్ధిపరచాలన్నారు. ఈ నెల 27వ తేదీన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో టూరిజం శాఖ డీఈ శ్రీశైలం, డీవైఎస్ఓ రాందాస్, డీటీసీపీఓ అన్సార్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైక్లింగ్ ట్రాక్‌తో ట్రాఫిక్ తిప్పలు

**మెట్టుగూడ,తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా తొలగించాలంటున్న వాహనదారులు**

**సాయంత్రం వేళ నరకప్రాయంగా మారుతున్న రాకపోకలు.. ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని వ్యాపారుల ఆక్రమణలు**





హైదరాబాద్(ప్రశ్న న్యూస్) నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, కొన్ని ప్రాంతాల్లో తీసుకుంటున్న నిర్ణయాలు వాహనదారులకు మరింత ఇబ్బందిగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ ప్రస్తుతం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ పెరిగినప్పుడు రోడ్డు చాలక ట్రాఫిక్ నెమ్మదించడంతో పాటు వాహనదారులు ట్రాక్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

### రోడ్డు చాలక.. ట్రాక్‌లోకి వాహనాలు

మెట్టుగూడ నుంచి తార్నాక మీదుగా సీసీఎంబీ వరకు ప్రధాన రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారి అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోవడంతో కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో సైక్లింగ్ ట్రాక్‌లోకి వెళ్లాల్సి వస్తోందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సైక్లిస్టులకు ఉద్దేశించిన ట్రాక్ సైకిల్ నడచేవారు లేక రోడ్డు తో ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ట్రాక్‌కు అడ్డుగా వ్యాపారుల ఆక్రమణలు

మరోవైపు సైక్లింగ్ ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని కొందరు వ్యాపారులు తమ కార్యకలాపాలను విస్తరించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్ పరిసరాల్లో వాహనాల నిలిపివేత, వ్యాపార సామగ్రి ఏర్పాటు తదితర కారణాలతో వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ట్రాక్ లక్ష్యం సైక్లిస్టులకు సురక్షిత మార్గం కల్పించడమే అయినప్పటికీ సైకిల్ నడిపేవారు లేకపోవడంతో ట్రాఫిక్‌కు అదనపు ఇబ్బందిగా మారిందని వాహనాదారులు పేర్కొంటున్నారు.

### హబ్సిగూడ-ఉప్పల్‌లో తొలగించడంతో ట్రాఫిక్ కష్టాలు తగ్గాయి

హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ వరకు సైక్లింగ్ ట్రాక్ తో ఎలాంటి ఉపయోగం లేకపోగా వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని ఎం ఎం సి కమిషనర్ పరిశీలించి తొలగించడంతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గిందని వాహనదారులు గుర్తుచేస్తున్నారు. అదే తరహాలో మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైక్లింగ్ ట్రాక్‌ను తొలగించి రహదారి వెడల్పును పెంచాలని కోరుతున్నారు.

### జోనల్ కమిషనర్ స్పందించాలి

సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ట్రాక్ వల్ల ట్రాఫిక్‌కు అవరోధంగా మారిందా.? అనే విషయాన్ని పరిశీలించి అవసరమైతే వెంటనే ట్రాక్‌ను తొలగించి రహదారి వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు.

హైదరాబాదులో ట్రాఫిక్ కష్టాలతో ప్రతిరోజూ అవస్థలు పడుతున్న వాహనదారుల విజ్ఞప్తిపై జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు ఇకనైనా స్పందిస్తారా.? లేక ట్రాఫిక్ జామ్‌లను చూస్తూ మౌనం వహిస్తారా అనేది వేచి చూడాలి.

# ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు.

ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు.

ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# ఆకలి నీ దారి ఏది

## మార్పు ఎక్కడో కాదు.. మన ప్లేట్ నుంచే మొదలవ్వాలి

**(చిన్న - ప్రశ్న న్యూస్ మేడ్చల్ ప్రతినిధి)**

ఒక ఫంక్షన్ అంటే కేవలం అలంకరణలు, సంగీతం, విందు, వినోదం మాత్రమే కాదు. అది మన సంస్కృతిని, మన బాధ్యతను చూపించే వేదిక. అందుకే ఫంక్షన్ నిర్వాహకులకు కూడా ఒక ముఖ్యమైన బాధ్యత ఉంది.

### ఒక ఫంక్షన్... ఒక బాధ్యత

అవసరానికి తగ్గట్టుగా ఆహారం సిద్ధం చేయాలి.
అతిథులు తినగలిగినంత మాత్రమే తీసుకునేలా అవగాహన కల్పించాలి.
మిగిలిన సురక్షితమైన ఆహారాన్ని బాధ్యతగా నిర్వహించాలి.
ఆహారం వృథా కాకుండా సిబ్బందికి ముందుగానే సూచనలు ఇవ్వాలి.

### ఒక ఫంక్షన్ ఎంత ఘనంగా జరిగిందో మాత్రమే కాదు..

ఎంత బాధ్యతగా జరిగిందో కూడా ముఖ్యం.
నా ఒక్క ప్లేట్ వల్ల ఏమవుతుంది.? అనుకోవద్దు
ఇదే మనం మార్చుకోవాల్సిన ఆలోచన.
"నేను కొద్దిగా మిగిల్చాను.. ఏమవుతుంది.?
నా ఒక్క ప్లేట్ వల్ల ఏం నష్టం.?
అందరూ ఇలానే చేస్తున్నారు కదా
అనే ఆలోచనలే సమస్యను పెంచుతున్నాయి.
ఒక్కొక్కరి బాధ్యత కలిస్తేనే పెద్ద మార్పు వస్తుంది.
ఒక్క ప్లేట్‌లో వృథా తగ్గితే..
వంద ప్లేట్లలో వృథా తగ్గుతుంది.
వంద ప్లేట్లలో తగ్గితే..
వేల ప్లేట్లలో తగ్గుతుంది.
మార్పు ఎక్కడో మొదలవ్వాల్సిన అవసరం లేదు.

### మన ప్లేట్ నుంచే మొదలవ్వాలి.

ఆహార వృథా.. కేవలం సామాజిక సమస్య కాదు



ఆహారం వృథా చేయడం వల్ల ఆహారాన్ని మాత్రమే కోల్పోవడం కాదు. ఆ ఆహారాన్ని పండించడానికి ఉపయోగించిన నీరు, భూమి, విద్యుత్, ఇంధనం, మానవ శ్రమ కూడా వృథా అవుతాయి.అంటే ఒక ప్లేట్ ఆహారాన్ని చెత్తలో పడేసినప్పుడు దాని వెనుక ఉన్న అనేక వనరులను కూడా మనం వృథా చేస్తున్నాం.అందుకే ఆహార వృథాను చిన్న విషయంగా చూడకూడదు.ఆహారాన్ని దానం చేయాలంటే కూడా జాగ్రత్త అవసరంమిగిలిన ఆహారాన్ని ఆకలితో ఉన్న వారికి అందించడం మంచి ఆలోచనే.కానీ ఆహార భద్రత చాలా ముఖ్యం.ఎక్కువసేపు బయట ఉంచిన, పాడైపోయే అవకాశం ఉన్న, పరిశుభ్రతపై అనుమానం ఉన్న ఆహారాన్ని ఎవరికైనా ఇవ్వడం సరికాదు.

### దానం చేయాలనుకుంటే..

తాజా, సురక్షితమైన ఆహారాన్నే ఎంపిక చేయాలి.
పరిశుభ్రమైన పాత్రల్లో ప్యాక్ చేయాలి.
వీలైనంత త్వరగా అవసరమైన వారికి అందించాలి.
ఆహారం సురక్షితంగా ఉందో లేదో పరిశీలించాలి.
స్థానికంగా పనిచేసే విశ్వసనీయ ఆహార సేవా సంస్థలు లేదా బాధ్యతగల వ్యక్తుల సహాయం తీసుకోవాలి.
దానం పేరుతో అనారోగ్యానికి కారణం కాకూడదు.

### ఇకనైనా మారాలి మన ఫంక్షన్ల తీరు

ఫంక్షన్‌కు వెళ్లినప్పుడు ముందుగా ప్లేటు నింపుకోవడం కాదు..
ముందుగా ఆకలిని అంచనా వేసుకోవాలి.
ఒక్కసారి కొద్దిగా తీసుకోవాలి. ఇంకా కావాలంటే మళ్లీ తీసుకోవచ్చు.



ఇది చిన్న మార్పే.
కానీ దీని ప్రభావం చాలా పెద్దది.
పిల్లలకు కూడా చిన్నప్పటి నుంచే ఆహారం విలువ చెప్పాలి.

### "ప్లేటులో పెట్టుకున్నది పూర్తిగా తినాలి" అనే మంచి అలవాటును పెంచాలి.

మార్పు మనతోనే మొదలు
ఫంక్షన్ హాల్‌లో భోజనం చేస్తున్నప్పుడు ఒక్కసారి మన ప్లేటును చూసుకుందాం.
నాకు అవసరమైనంతే ఉందా.?
నేను తీసుకున్నదంతా తినగలనా.?
మిగిలితే చెత్తలోకేనా.?
అనే మూడు ప్రశ్నలు వేసుకుందాం.
ఆ మూడు ప్రశ్నలు మనలో బాధ్యతను పెంచుతాయి.
ఆకలితో ఉన్నవాడికి ఒక ముద్ద అన్నం విలువ తెలుసు.
మనకు మాత్రం ఆ ముద్దను వృథా చేసే ముందు ఒక్కసారి ఆలోచించే బాధ్యత ఉంది.

### అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు..

ఆ పరబ్రహ్మను చెత్తకుప్పలోకి పంపకండి
రైతు చెమటను గౌరవిద్దాం..
ఆహారాన్ని గౌరవిద్దాం..
ఆకలిని అర్థం చేసుకుందాం..
వృథాను అరికడదాం..
నా ఒక్క ప్లేట్‌తో ఏమవుతుంది.?అని కాదు..
నా ఒక్క ప్లేట్‌తోనే మార్పు ఎందుకు మొదలు కాకూడదు.? అని ఆలోచిద్దాం.

# హైదరాబాద్ హాస్టళ్లకు 'హైడ్రా' స్ట్రిక్ట్ వార్నింగ్

**- ప్రమాదకర భవనాలకు 3 నెలల గడువు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని హాస్టళ్ల భద్రతపై హైడ్రా కఠిన నిబంధనలు జారీ చేసింది. సురక్షితం కాని, అనుమతులు లేని భవనాల్లో నడుస్తున్న హాస్టళ్లను మూడు నెలల్లోగా సురక్షితమైన భవనాల్లోకి మార్చాలని నిర్వాహకులకు అల్టిమేటం ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రమాదకర భవనాలను కూల్చివేస్తామని స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధ్యక్షతన హాస్టళ్ల నిర్వాహకులు, భవన యజమానులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టళ్లలో నివసించే విద్యార్థులు, ఉద్యోగుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రతి హాస్టల్‌లో అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, నిర్మాణ పటిష్ఠత తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకర భవనాల్లో హాస్టళ్లు నడిపేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ఇద్దరు మరణించడం, ఢిల్లీలో హాస్టల్ భవనం కూలి పలువురు చనిపోవడం వంటి ఘటనల నేపథ్యంలో హైడ్రా ఈ కీలక నిర్ణయాలు తీసుకుంది. అనుమతులు లేని భవనాలపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించేందుకు మూడు మున్సిపల్ కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు. కేవలం లాభార్జన కోసం భద్రతను విస్మరించవద్దని, హాస్టల్ వాసులను తమ సొంత బిడ్డల్లా భావించి వసతులు కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య అగ్నిప్రమాదాలు నివారణ చర్యల, ఫైర్ సేఫ్టీ నిబంధనలపై వీడియోల ద్వారా నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు.

# ప్రకటనలకే పరిమితమైన ప్లాస్టిక్ నిషేధం

**గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యథేచ్ఛగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం**

**ప్రచారం హడావుడి.. క్షేత్రస్థాయిలో కనిపించని చర్యలు**

**ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల డిమాండ్**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెలలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు విధిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ ప్రకటనలకు అనుగుణంగా చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### యథేచ్ఛగా విక్రయాలు.. వినియోగం

పట్టణంలోని ప్రధాన మార్కెట్, కూరగాయల సంతలు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, స్పూన్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వ్యాపారులు, వినియోగదారులు నిషేధ నిబంధనలను పెద్దగా పట్టించుకోవడం లేదని, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు బహిరంగంగానే కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### అధికారుల పర్యవేక్షణ ఏది?

ప్లాస్టిక్ నిషేధంపై ప్రకటన చేసిన సమయంలో కొద్దిరోజుల పాటు హడావుడి చేసిన అధికారులు ఆ తర్వాత తనిఖీలను విస్మరించారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారులకు అవగాహన కల్పించడం, ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం వంటి చర్యలు క్రమం తప్పకుండా చేపట్టడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ప్లాస్టిక్ రహిత గజ్వేల్ లక్ష్యం కాగితాలకే పరిమితమవుతోందని వారు విమర్శిస్తున్నారు.

### పర్యావరణానికి ముప్పు

విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీల్లో పేరుకుపోవడంతో మురుగునీటి




ప్రవాహానికి ఆటంకం ఏర్పడే పరిస్థితి నెలకొంటోంది. దీంతో దోమల వృద్ధికి అవకాశం ఏర్పడి, ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి కేవలం ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని పట్టణ ప్రజలు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేలా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588